ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -83 పేజీలు - 8 వెల - 03/- ఆదివారం 12 జులై 2026

## పోక్సో కేసు పెట్టారని
# ఆరుగురి దారుణ హత్య

- షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం
- ఆరుగురని దారుణంగా హత్య చేసిన సైకో
- అనంతరం గ్రామం నుంచి పరార్
- నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు
- సైకోను పట్టుకోవాలంటూ గ్రామస్థుల ఆందోళన

రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోక్సో కేసులో జైలు నుంచి వచ్చిన ఓ కిరతాకుడు నరమేథం సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని దారుణంగా నరికి చంపాడు. ఆరుగురు హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది.


2లో.

## వియత్నాంలో
# విషాదం

### ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక... 15 మంది మృతి

- ప్రమాదంలో గాయపడిన పలువురి పరిస్థితి విషమం
- ఫు క్వాక్ దీవి సమీపంలో అదుపుతప్పిన పడవ
- రంగంలోకి దిగిన భారత ఎంబసీ.. సహాయక చర్యలు ముమ్మరం


2లో.

## మధుర గాయని ఎస్.జానకి కన్నుమూత

### వయోభారంతో మైసూరులో మృతి



**మైసూరు,జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :**
సుస్వరాల గొంతుక మూగబోయింది. తన గాన మాధుర్యంతో తెలుగు శ్రోతలను అలరించిన గంధర్వ గాయని పరలోకానికేగారు. ప్రముఖ గాయని ఎస్.జానకి కన్నుమూశారు. మైసూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. వయోధిక సమస్యలతో ఆమె కన్నుమూసినట్లు మనవరాలుమిగతా 2లో...

# పిల్లలే నిజమైన సంపద



- జనాభా నియంత్రణ కాదు..
- జనాభా సంరక్షణ నినాదం రావాలి
- దక్షిణాదిలో జనాభా తగ్గడం ఆందోళనకరం
- ప్రపంచ జనాభా దినోత్సవంలో చంద్రబాబు

**విజయవాడ,జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :**
జనాభా నియంత్రణ కాదు.. జనాభా సంరక్షణ నినాదం రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు జనాభా తగ్గాలని అందరం కోరుకున్నామని, ఇద్దరికంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చెప్పామని అన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని తెలిపారు. పిల్లలే సంపద అనే మాటను నిజం చేస్తామన్నారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గిపోతోంది. యువత ఆశలు, ఆకాంక్షలను సాకారం చేయాలి.మిగతా 2లో...



## బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ



- హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ కారిడార్
- దేశంలో 7 బుల్లెట్ ట్రైన్లకు మూడు తెలంగాణకే
- దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ
- ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తి
- వికసిత్ భారత్- సాంకేతికత పాత్ర అంశంపై అశ్వినీ వైష్ణవ్

**హైదరాబాద్,జులై 1(ఆర్ఎన్ఎ):**
తెలంగాణకు రైల్వే బడ్జెట్‌ను కేంద్రం భారీగా పెంచిందని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర' అనే అంశం నిర్వహించిన సదస్సులో కేంద్రమంత్రిమిగతా 2లో...

# కాళేశ్వరంగేట్లు మూస్తే కూలిపోతాయి

- కాళేశ్వరం బ్యారేజీల గేట్లు మూయడం ప్రమాదకరమని ముఖ్యమంత్రి హెచ్చరిక
- పునరుద్ధరణ పూర్తయ్యే వరకు గేట్లు తెరిచే ఉంచాలని స్పష్టీకరణ
- జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారమే మరమ్మతులు
- బీఆర్ఎస్ నేతల కమిటీ సిఫార్సులను పక్కనపెడుతున్నట్లు వెల్లడి
- గత ప్రభుత్వ అవినీతి వల్లే ప్రాజెక్టుకు ఈ దుస్థితి అని విమర్శలు

**హైదరాబాద్,జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :**
కాళేశ్వరం విషయంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టాలని బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మాజీమంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఎంపీ ఈటల అవాస్తవాలు చెప్పారని ధ్వజమెత్తారు. ఎంపీ ఈటల అంటే తమకు గౌరవమేనని తెలిపారు. ఆ వ్యాఖ్యలతో ఈటల తన గౌరవం పోగొట్టుకున్నారని విమర్శించారు. ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకే తాము ప్రయత్నిస్తున్నామని అన్నారు. మిగతా 2లో...



## పరిశోధనలు, స్టార్టప్‌లపై దృష్టి

- యువతకు గవర్నర్ అబ్దుల్ నజీర్ పిలుపు
- గురజాడ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో పట్టాలు పంపిణీ

**విశాఖపట్టణంజులై 11 (రిపబ్లిక్ న్యూస్) :**
యువత పరిశోధనలు, ఆవిష్కరణలు స్టార్టప్‌ల వైపు అడుగులు వేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలో ఏయూ కన్వెన్షన్ హాల్లో జేఎన్టీయూ గురజాడ విశ్విద్యాలయం ప్రథమ స్నాతకోత్సవం జరిగింది. 2023, 2024, 2025 విద్యా సంవత్సరాలకు చెందిన ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాలుమిగతా 2లో...




## పల్లి పల్లి మినిస్టర్..

- విజయవంతంగా ముగిసిన మంత్రి లోకేశ్ కొరియా పర్యటన
- లోకేశ్ వేగాన్ని చూసి 'పల్లి పల్లి' (త్వరగా త్వరగా) మంత్రి అని ప్రశంసించిన కొరియన్లు


2లో.

## కడపలో కరోనాకు అడ్డుకట్ట వేయండి

- కలెక్టర్, డీఎంహెచ్ వోకు ఫోన్లో జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశం
- కేసులు నమోదైన ప్రాంతాల్లో కొవిడ్ నిబంధనలు అమలు చేయండి
- రద్దీ ప్రాంతాల్లో మాస్క్ ధరించడం తప్పనిసరి చేయండి : మంత్రి సవిత

**అమరావతి, జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :**
కడప జిల్లాలో కరోనా మహమ్మారి వ్యాప్తి చెందకుండా అడ్డుకట్ట వేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆదేశించారు. అదే సమయంలో కరోనా నివారణపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, కొవిడ్ -19 నిబంధనలు అమలు మిగతా 2లో...



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# కాళేశ్వరంగేట్లు మూస్తే కూలిపోతాయి

**మొదటిపేజీ తరువాయి**

శనివారం మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ నేతలు, ఎంపి ఈటెల చేస్తున్న ప్రకటనలు దారుణమని అన్నారు. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఎన్‌డిఎస్ఎ ఇచ్చిన నివేదిక, ఆదేశాల మేరకు తాము నడుచుకుంటున్నామని స్పష్టం చేశారు. కేంద్రంలో పలుకుబడి ఉన్న బిజెపి ఎంపిగా ఈటెల రాజేందర్ జలశక్తి మంత్రిత్వ శాఖను కలిసి, ఎన్‌డిఎస్ఎ ఆధ్వర్యంలో కాళేశ్వరం నీటిని ఎత్తి పోస్తే తమకు అభ్యంతరం లేదని తేల్చి చెప్పారు. ఎన్‌డిఎస్‌ను కలసి నీటిని ఎత్తి పోసేందుకు అనుమతి తెస్తే అందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం ఉండబోదన్నారు. ఎన్‌డిఎస్ఎ ఆదేశాల మేరకు మేడిగడ్డ గేట్లు ఎత్తే ఉంచామని అన్నారు. మేడిగడ్డ గేట్లు మూస్తేనే కన్నెపల్లి వద్ద పంపులు నడపడానికి వీలుంటుంద న్నారు. అలా కాకుండా పారుతున్న నీటని ఎత్తిపోయడం సాధ్యం కాదన్నారు. ఇకపోతే పట్టిసీమ కోసం నీటిని వదులుతున్నామని చేస్తున్న ఆరోపణలపైనా సిఎం మండిపడ్డారు. పోలవరం పూర్తి చేసుకునే వరకు పట్టిసీమను కట్టుకున్న విషయం ఆనాటి మంత్రి హరీష్ రావుకు తెలియదా అన్నారు. కావాలనే బురదజల్లే ప్రయత్నాలు చేయడంపై మండిపడ్డారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో నీటిని ఎత్తి ప ఓయడం కుదరదని సిఎం తేల్చారు. ఒకవేళ గేట్టు మూస్తే భద్రాచలం వరకు ముంపు తప్పదని ఎన్‌డిఎస్ఎ తెలిపిందని అన్నారు. కేసీఆర్ హయాంలో 2019 జూన్ 21వ తేదీన కాళేశ్వరం ప్రారంభించాక, కేసీఆర్ హయాంలోనే మేడిగడ్డ లోపాలు బయటపడ్డాయని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు బయటపడ్డాయని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో లోపాలు ఉన్నాయని.. 2020 మే 18వ తేదీన ఈఈ రమణారెడ్డి కేసీఆర్ ప్రభుత్వానికి లేఖ రాశారని ప్రస్తావించారు. లోపాలు సవరించాలని అప్పట్లోనే ఇంజినీర్లు సూచించారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యంతో లోపాలు పెరిగి పెద్దవై బ్యారేజ్ కుప్పకూలిందన్నారు. 2022 జులై 14వ తేదీన వరదలకు కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని చెప్పారు. ఇప్పటికీ కన్నెపల్లి పంప్‌హౌస్ వినియోగంలోకి రాలేదని తెలిపారు. 2023 అక్టోబర్ 21వ తేదీన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ప్రస్తావించారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై.. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఎన్డీఎస్ఏ కమిటీ ఏర్పాటు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలం కావని ఎన్డీఎస్ఏ తేల్చిచెప్పిందని అన్నారు. ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణం, నిర్వహణ లోపాలపై.. గతంలోనే ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. ప్రాథమిక, తుది నివేదికల్లో ఎన్డీఎస్ఏ అదే విషయం చెప్పిందని అన్నారు. లోపాలు సవరించాలని నిపుణులు చెప్పినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మొదట్లోనే స్పందించకపోవడంతో ఈ సమస్య పెద్దది అయిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అబద్దాలు ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పిల్లలే నిజమైన సంపద

**మొదటిపేజీ తరువాయి**

ఆడపిల్లలు ఇప్పుడు ఇంటికి భారం కాదు.. ఆస్తి. ఐటీ చదువుకోవాలని గతంలో ఆడపిల్లలను ప్రోత్సహించా. వరకట్నం కాదు.. ఆడపిల్లలకే ఎదురుకట్నం ఇచ్చే పరిస్థితి వచ్చింది. పిల్లలు వద్దనుకునే దంపతులు పెరగడం దురదృష్టకరం అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఏటా జనాభా తగ్గిపోతోంది. నగరాలు, అర్బన్ ప్రాంతాల్లో జనాభా బాగా తగ్గిపోతోంది. పిల్లల సంఖ్య తగ్గి.. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ఇంట్లో పెద్దలు లేకపోతే పిల్లల పెంపకంలో అనేక ఇబ్బందులు వస్తాయి. పిల్లలే మన రాష్ట్ర సంపద.. వారితోనే ఆర్థిక ప్రగతి. సరిపడా జనాభా లేకుంటే అనేక సమస్యలు వస్తాయని హెచ్చరించారు. పిల్లల్ని పెంచే బాధ్యతను తండ్రి కూడా తీసుకోవాలి. ఇంటిపని, వంటపని అనే తేడా లేదు. అన్నింట్లోనూ మగవాళ్లు సాయం చేయాలి. సంజీవిని కింద డిజిటల్ ఆరోగ్య రికార్డులు తీసుకుంటున్నాం. మెంటల్ సిక్‌నెస్ అతిపెద్ద సమస్యగా తయారైంది. సోషల్ మీడియా వల్ల మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. విలువైన సమయం వృథా చేసుకుంటున్నారు. నేటి యువత యోగా, ధ్యానం అలవరచుకోవాలని సూచించారు. 60 ఏళ్లు దాటాక సమాజం కోసం పని చేయాలి. జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలి. నైపుణ్యాలు పెంచుకోవాలి. నియంత్రణ లేకుంటే ఏ టెక్నాలజీ అయినా ప్రమాదమే. ప్రతి ఒక్కరూ జీవితాన్ని సరిగా ప్లాన్ చేసుకోవాలి. జనాభా తగ్గిపోతే అనుకున్న లక్ష్యాలు సాధించలేం. 2040కే స్వర్ణాంధ్ర సాధించుకునే సత్తా మనకుందని చంద్రబాబు అన్నారు.ప్రపంచ జనాభా దినోత్సవం 2026 చరిత్రలో నిలిచిపోతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విజయవాడలోని అంబేడ్కర్ కళావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆసక్తిగా తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి వైద్యులు, వైద్య కళాశాలకు చెందిన విద్యార్థులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. నేడు ప్రపంచంలో ఎక్కడ చూసినా అత్యధిక ఆదాయం సంపాదించేవారు తెలుగువారేనని తెలిపారు. ఆరోజు ఐటీ గురించి మాట్లాడానని.. ఈరోజు ఏఐ గురించి మాట్లాడుతున్నానని చెప్పారు. ఆనాడు తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించాలంటే చాలా ఆలోచన చేసే వారని పేర్కొన్నారు. ఆనాడు త్వరగా పెళ్లిళ్లు చేసి అత్తగారింటికి పంపిస్తే బాధ్యత అయిపోతుందని అనుకునేవారని సీఎం చంద్రబాబు చెప్పారు. అప్పుడు మగపిల్లలకు పోటీగా ఆడపిల్లలు ఎదగాలని బాగా చదివించాలని చెప్పానని గుర్తుచేశారు. ఉద్యోగాల్లో, కాలేజీల్లో 33 శాతం రిజర్వేషన్లు కూడా ప్రవేశపెట్టామని తెలిపారు. అప్పుడు వరకట్నం ఉండేదని.. ఇప్పుడు ఎదురు కట్నం వచ్చిందని ప్రస్తావించారు. ఆడపిల్లలే ఎదురు కట్నం తీసుకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు. నేడు భర్తల కన్నా భార్యల ఆదాయం ఎక్కువగా ఉందని వివరించారు. తనకన్న తన సతీమణి ఆదాయం, తన కొడుకు కంటే.. తన కోడలు ఆదాయమే ఇప్పుడు ఎక్కువుగా ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# పోక్సో కేసు పెట్టారని ఆరుగురి దారుణ హత్య

**షాబాద్ పరిధిలో కనీవినీ ఎరుగని దారుణం**

**ఆరుగురని దారుణంగా హత్య చేసిన సైకో**





**రంగారెడ్డి,జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :** రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. పోక్సో కేసులో జైలు నుంచి వచ్చిన ఓ కిరతాకుడు నరమేథం సృష్టించాడు. ఏకంగా ఆరుగురిని దారుణంగా నరికి చంపాడు. ఆరుగురు హత్యకు గురైన ఘటన కలకలం సృష్టించింది. షాబాద్ మండల కేంద్రంలోని దైవాలగూడలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ (28) అనే దుర్మార్గుడు ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపాడు. మొదట షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. ఆ తర్వాత తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి నేనే ఆరుగురిని చంపాను, నేను కూడా చనిపోతున్నానని చెప్పాడు. దీంతో అరుణ్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. షాబాద్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనాస్థలిని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి పరిశీలించారు. బాలికను వేధించాడని ఆమె తల్లి మే 16న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు నమోదు చేసి రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. బెయిల్‌పై తిరిగొచ్చిన నిందితుడు.. అర్ధరాత్రి ఈ దారుణానికి పాల్పడ్డాడు. నిందితుడు రాజ్‌కుమార్.. ఏడేళ్ల క్రితం సరితను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయినా భార్యను ఇద్దరు పిల్లలను కూడా చంపడం అతని సైకో మనస్తత్వానికి నిదర్శనంగా చూడాలి. ఆరుగురి హత్య కేసులో మృతుల బంధువుల ఆందోళనతో షాబాద్‌లో ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలంటూ షాబాద్-కంది రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. రాజ్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయకపోతే మరొకరి ప్రాణం తీస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడు రాజ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, ఏడు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని ఫ్యూచర్‌సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు.

# వియత్నాంలో ఘోర ప్రమాదం..

## ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక... 15 మంది మృతి

**వియత్నాం జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :**

వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం పరిస్థితుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం.

ఓషన్ పెరల్ ఐలాండ్ కంపెనీకి చెందిన 'ఏజీ-26751' అనే పర్యాటక స్పీడ్ బోటులో భారత పర్యాటకులు సిబ్బందితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫు క్వాక్ దీవి సమీపంలోని హాన్ మే రుట్ న్గోయి ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో, బలమైన గాలులు మరియు అలల ఉధృతికి పడవ అదుపుతప్పి బోల్తా పడింది.



స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 21 మందిని రక్షించగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

ఒక మొబైల్ కంపెనీ తరఫున సుమారు 250 మంది డిస్ట్రిబ్యూటర్లు వియత్నాం పర్యటనకు వెళ్లారు. వీరిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు 35 మంది, తెలంగాణకు చెందిన వారు 40 మంది ఉన్నారు. మృతుల్లో మచిలీపట్నంకు చెందిన డిస్ట్రిబ్యూటర్ గిల్లి కిశోర్ భార్య జయశ్రీ, కడపకు చెందిన ముడియం శ్రీధర్ ఉన్నట్లు గుర్తించారు. గిల్లి కిశోర్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్లు సమాచారం.

కడపకు చెందిన నయీమ్ అనే డిస్ట్రిబ్యూటర్ ఆ బోటు ఎక్కకపోవడంతో తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. మొత్తం ఐదు బోట్లలో పర్యాటకులు విహారానికి వెళ్లగా, అందులో ఒక బోటు ప్రమాదానికి గురైంది.

ఈ విషాద ఘటనపై వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం తక్షణమే స్పందించింది. ప్రమాదాన్ని ధ్రువీకరిస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన కార్యాలయం, సహాయక చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయని పేర్కొంది.

బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు హో చి మిన్ సిటీ, హనోయ్‌లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఇందుకోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లను (+84 36 281 7930, +84 91 552 37 14, +84 33 452 0414, +84 91 308 9165) కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.

# మధుర గాయని ఎస్.జానకి కన్నుమూత

**మొదటిపేజీ తరువాయి**

అప్సర విద్యుల ఇన్‌స్టా వేదికగా ప్రకటించారు. దక్షిణ భారత గానకోకిలగా పేరుగాంచిన ఆమె అన్ని భాషల్లో కలిపి ఆమె సుమారు 50 వేలకు పైగా పాటలను పాడారు. 1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో ఎస్.జానకి జన్మించారు. తెలుగు చలన చిత్రసీమంలో ఆణిముత్యాల్లాంటి పాటలకు ఆమె ప్రాణం పోశారు. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో అద్భుతమైన పాటలను పాడారు. ఆమె గాన మాధుర్యానికి నాలుగు జాతీయ అవార్డులు సహా, 33 వివిధ సినీ అవార్డులు వరించాయి. సంగీత ప్రపంచానికి ఆమె సేవను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2013లో పద్మభూషణ్‌తో సత్కరించింది. తొలితరం ఘంటసాల నుంచి మలితరం బాలసుబ్రహ్మణ్యంతో కలిసి అద్భుత గీతాలు ఆలపించారు. పగలే వెన్నెలా అంటూ పలకరించిన మన జానకి లేదన్న విషయం సినీ ప్రపంచాన్ని దిగ్భ్రమకు గురిచేసింది. ప్రియమైన అమ్మమ్మ, దిగ్గజ గాయని ఎస్.జానకి కన్నుమూశారన్న వార్త తెలియజేయడానికి ఎంతో విచారిస్తున్నా. కుటుంబ సభ్యుల ప్రేమ, ఆప్యాయత మధ్య ప్రశాంతంగా మనల్ని విడిచి వెళ్లిపోయారు. ఆమె అద్భుతమైన జీవితాన్ని గడిపారు. తన గానంతో లక్షల మందికి ఆనందింపజేశారు. ఆమె ఒక దిగ్గజ గాయని. ఆమె పాటలు మధుర జ్ఞాపకాలు. ఈ దుఃఖ సమయంలో మా కుటుంబ ఏకాంతను గౌరవించాల్సిందిగా కోరుతున్నా' అని అప్సర తెలిపారు.

# పరిశోధనలు, స్టార్టప్‌లపై దృష్టి

**మొదటిపేజీ తరువాయి**

ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, ఎండోమెంట్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఏపీ గవర్నర్ నజీర్, వీసీ వీవీ.సుబ్బారావు, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సీఈఓ మయూర్ పట్నాల, వివిధ యూనివర్శిటీల వీసీలు, రిజిస్ట్రార్లు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రసంగించారు. విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకూడదని గవర్నర్ వ్యాఖ్యానించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఉపాధి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని దిశానిర్దేశర చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటాసైన్స్, రోబోటిక్స్ వంటి సాంకేతికతను సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించాలని మార్గనిర్దేశర చేశారు. విద్యార్థులను ప్రపంచస్థాయి పౌరులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులు, విద్యాసంస్థలదే కీలక పాత్ర అని తెలిపారు. జేఎన్‌టీయూ జేవీ క్యాంపస్‌లో ఉన్నత విద్యా ప్రమాణాలతో విద్యాబోధన అందిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. క్యాంపస్‌లో జల సంరక్షణ పటిష్ఠంగా అమలు చేస్తున్నారని గవర్నర్ కొనియాడారు. సింగిల్ యూజ్ ఎ÷-లాస్టిక్‌ను నిషేధించడం, క్యాంపస్ అంతటా ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా యూనివర్శిటీని 'నెట్ జీరో క్యాంపస్'గా మార్చేందుకు కృషి చేస్తున్నారని కితాబు ఇచ్చారు. సమ్మర్ ఇంటర్న్‌గా సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు హాస్టల్ బిల్డింగ్‌ల రిపేర్లు, రినోవేషన్ పనులను స్వయంగా పూర్తి చేయడం గొప్ప విషయమని ప్రశంసించారు. జాతీయ విద్యా విధానం 2020 ద్వారా సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, నైతిక విలువలతో కూడిన విద్య అందుతుందని గవర్నర్ నజీర్ పేర్కొన్నారు.

---------

# కడపలో కరోనాకు అడ్డుకట్ట వేయండి

**మొదటిపేజీ తరువాయి**

చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ను, డీఎంహెచ్ వో రవిబాబును ఫోన్లో ఆదేశించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కడపలో ఎనిమిది కరోనా కేసులు నమోదు కావడమే కాకుండా ఇద్దరు మృతి చెందడంపై జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో కొవిడ్ -19 నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. స్థానికుల్లో కరోనా నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రద్దీగా ఉండే ప్రదేశాలు, ఆసుపత్రుల వద్ద మాస్క్ లు వాడకం తప్పనిసరి చేయాలన్నారు. జ్వరం, దగ్గు, ఇతర కోవిడ్ లక్షణాలున్న వారిని గుర్తించి ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. కలెక్టర్ శ్రీధర్, డీఎంహెచ్ వో రవిబాబు మాట్లాడుతూ, ఎనిమిది కరోనా కేసులు మినహా కొత్తగా కేసులు నమోదు కాలేదన్నారు. ప్రస్తుత కరోనా వెరియంట్ వ్యాప్తిపై శాంపిళ్లను పూణే ల్యాబ్ కు పంపామన్నారు. ప్రస్తుతం నమోదైన కరోనా వేగవంతంగా వ్యాప్తి చెందుతుందా... నెమ్మదిగా సోకుతుందా..? అనేది ల్యాబ్ నుంచి వచ్చే రిపోర్టులో వెల్లడవుతుందన్నారు. ఇప్పటికే కరోనా కేసులు నమోదైన ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టామని, బ్లీచింగ్ వెదజల్లామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, కరోనా నమోదైన కుటుంబాల్లో సభ్యులకు కూడా తక్షణమే పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ నమోదయితే వారిని కూడా ఐసోలేషన్ వార్డుకు తరలించాలన్నారు. నెగిటివ్ వస్తే... కొద్ది రోజుల పాటు వారి ఇళ్లల్లోనే ఐసోలేషన్ లో ఉంచాలని తెలిపారు. మరో మరణం సంభవించకుండా, ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో ఉన్నవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మేరకు కోవిడ్-19 టీకాలు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ను, డీఎంహెచ్ వో రవిబాబుకు మంత్రి సవిత ఫోన్లో స్పష్టంచేశారు.

# బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

కిషన్‌రెడ్డితో కలిసి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరును కలుపుతూ బుల్లెట్ ట్రైన్లు రానున్నాయని తెలిపారు. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఏపీకి ఇచ్చిన రైల్వే బడ్జెట్ రూ.880 కోట్లు మాత్రమే.. మోదీ సర్కార్ కేవలం తెలంగాణకే రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ఆధునికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా 1,300 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు చేపట్టామని వివరించారు. ఇప్పటికే 260 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పూర్తయ్యిందని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో 40 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణకు నిధులు ఇచ్చామన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు.ఇవి అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ దేశంలో పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. కొంతమంది దీని క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రెడిట్ కేవలం నరేంద్ర మోదీకి మాత్రమే దక్కుతుందని అన్నారు. 'వికసిత్ భారత్-2047' లక్ష్య సాధనలో సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని అశ్విని వైష్ణవ్ అన్నారు. వందేభారత్ రైళ్లు ప్రపంచస్థాయి సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడ్డాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా 36,000 కి.మీ. కొత్త రైల్వే ట్రాక్‌లు నిర్మించామని తెలిపారు. అలాగే 2,700 కి.మీ. డెడికేటెడ్ ÷-రెట్ కారిడార్ పూర్తి చేసినట్లు వెల్లడించారు. దేశంలోని రైల్వే నెట్‌వర్క్‌లో 99.4శాతం విద్యుద్దీకరణ పూర్తయిందని, దీంతో డీజిల్‌పై ఆధారపడటం దాదాపు పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. తెలంగాణకు ఇప్పటికే ఐదు వందేభారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయని, త్వరలో మరిన్ని సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు.

# పల్లి పల్లి మినిస్టర్..

**విజయవంతంగా ముగిసిన మంత్రి లోకేశ్ కొరియా పర్యటన**

**లోకేశ్ వేగాన్ని చూసి 'పల్లి పల్లి' (త్వరగా త్వరగా) మంత్రి అని ప్రశంసించిన కొరియన్లు**

**జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :**

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ చేపట్టిన వారం రోజుల దక్షిణ కొరియా పర్యటన అద్భుతరీతిలో విజయవంతమైంది. భారత్-కొరియా మధ్య వాణిజ్య, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే క్రమంలో ఈ పర్యటన ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. దక్షిణ కొరియా విదేశాంగ శాఖ అధికారిక ఆహ్వానం మేరకు ఈ నెల 5 నుంచి 11 వరకు సాగిన ఈ పర్యటనలో మంత్రి లోకేశ్, ఆయన బృందం అక్కడి ప్రభుత్వ, పారిశ్రామిక వర్గాల నుంచి విశేష గౌరవాన్ని అందుకుంది.

ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్ 50కి పైగా కార్పొరేట్ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఎల్జీ, హ్యుందాయ్, శాంసంగ్, బీఎన్‌కే ఫైనాన్షియల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులతో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. ముఖ్యంగా ఎల్జీ సంస్థ తమ ప్రధాన కార్యాలయానికి లోకేశ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించి, ఉన్నత స్థాయి బృందంతో గౌరవ విందు ఇవ్వడం ఈ పర్యటనకు లభించిన ప్రాధాన్యతను చాటుతోంది. ఏపీలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పారదర్శక పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై లోకేశ్ ఇచ్చిన ప్రజెంటేషన్‌కు కొరియన్ కంపెనీల నుంచి అద్భుత స్పందన లభించింది. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను తమ ఉన్నత యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఆయా సంస్థలు హామీ ఇచ్చాయి.

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
ఆదివారం 12 జులై 2026

# యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి

## జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



**అనంతపురం కలెక్టరేట్, జులై 11,( రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా, డీఏపీ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ తెలిపారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు.

**శాస్త్రీయ పద్ధతిలో ఎరువుల వినియోగానికి అవకాశం**

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ నుంచి ఏపీఎఎంఎస్ ( ఏపీ ఏ ఎమ్ ఎస్) యాప్ ద్వారా ఎరువుల పంపిణీ చేపట్టిందని చెప్పారు. గతంలో మాన్యువల్ విధానంలో సాగిన పంపిణీని ఇప్పుడు యాప్ ఆధారంగా నిర్వహించడం వల్ల పారదర్శకతతో పాటు సమర్థత కూడా పెరిగిందన్నారు. రైతు సాగు చేస్తున్న పంట, విస్తీర్ణం ఆధారంగా ఎంత యూరియా అవసరమో యాప్ సూచిస్తుందని, దీంతో అధిక మోతాదులో యూరియా వినియోగం తగ్గి శాస్త్రీయ పద్ధతిలో ఎరువుల వినియోగానికి అవకాశం కలుగుతుందన్నారు.

జిల్లాలో మొత్తం 3,91,215 మంది రైతులు ఉండగా, ఇప్పటికే 90 శాతం మందిని యాప్‌లో నమోదు చేశామని, మిగిలిన రైతులను కూడా వారం నుంచి పది రోజుల్లోగా నమోదు పూర్తి చేస్తామని తెలిపారు. రిటైలర్లు, ఆర్ఎస్కేలు, ప్యాక్స్‌లు, డీసీఎంఎస్ కేంద్రాలకు శిక్షణ ఇచ్చి వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నట్లు చెప్పారు.

**ఎరువుల పంపిణీ ఆటంకాలు లేకుండా కొనసాగుతోంది**

ప్రస్తుతం జిల్లాలో 18,258 మెట్రిక్ టన్నుల యూరియా, 4,794 మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. జూలై నెల అవసరం సుమారు 11 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే కాగా, అందుకు మించి నిల్వలు ఉండటంతో కొరతకు అవకాశం లేదన్నారు. జిల్లాలో ఎరువుల పంపిణీ ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతోందని చెప్పారు.రైతులు యూరియాను ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువకు కొనవద్దని, ఎవరైనా రిటైలర్లు నానో యూరియా కొనుగోలు చేయాలని ఒత్తిడి చేసినా లేదా అధిక ధర వసూలు చేసినా సంబంధిత ఆర్ఎస్కే అసిస్టెంట్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదులు వచ్చినట్లయితే సంబంధిత రిటైలర్లపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో నమోదు కాని ఓటర్ల జాబితాలు పరిశీలించిన రామిరెడ్డి ధ్వజా రెడ్డి.

**రైల్వే కోడూరు జూలై 11 రిపబ్లిక్ న్యూస్.**

సర్ కార్యక్రమంలో ఓటర్ల జాబితాలో నమోదు కాని ఓటర్ల జాబితాలను రాష్ట్ర వైఎస్ఆర్సిపి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, రైల్వే కోడూరు మండల వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పరిశీలించారు, రైల్వే కోడూరు నియోజకవర్గం రైల్వే కోడూరు మండలం యానాది పల్లి లో శనివారం జరిగిన సర్ ప్రక్రియలో భాగంగా ఎన్ని మరేసిన పత్రాల పరిశీలన పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు యానాదిపల్లిలో సర్ ప్రక్రియలో నమోదు కాని ఓటర్ల పనితీరును నాయకుల దృష్టికి తీసుకెళ్లి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అంతేకాకుండా ఈ కార్యక్రమం తొందరలో గడువు ముగుస్తున్నందువల్ల సత్వరం స్థానిక నాయకులు వీఎల్వోలు బిఎల్ఎ లతో కలిసి సమస్యలను పరిష్కరించి ఓటర్లకు న్యాయం చేయాలని ఆయన కోరరు,ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్ షఫీ, రెడ్డయ్య రెడ్డి మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# ఆదిత్యనగర్‌లో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల దాడి

### ఇద్దరు నిర్వాహకులు, ఒక విటుడు అరెస్ట్
### కేసు నమోదు చేసి న్యాయస్థానానికి తరలింపు



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 11)**

కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఉల్చాల రోడ్ సమీపంలోని ఓ ప్రాంతంలో జరిగిన ఈ దాడుల్లో ఇద్దరు నిర్వాహకులు, ఒక విటుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.పోలీసుల కథనం ప్రకారం, కర్నూలుకు చెందిన వంశీకృష్ణ, రామకృష్ణలు అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఆదోనికి చెందిన భరత్ అనే వ్యక్తిని విటుడిగా అరెస్ట్ చేశారు.నిందితులపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచినట్లు కర్నూలు నాల్గవ పట్టణ సీఐ విక్రమ్ సింహా తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

# గుట్టపాడు గ్రామంలో గంగమ్మ తల్లికి 101 బిందెలు నీళ్లు పోసిన గ్రామస్తులు

### రాష్ట్రవ్యాప్తంగా వర్షం కురవాలని గంగమ్మ తల్లిని వేడుకున్నారు



**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 11 (రిపబ్లిక్ న్యూస్)** ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామంలోగంగమ్మ తల్లి కరుణించి రాష్టంలో వర్షం కురవాలని గుట్టపాడు గ్రామంలోని ప్రజలు అందరూ కలిసి గంగమ్మ కు 101 బిందెలు నీళ్ళు పోయడం జరిగుతుంది. వర్షం రావాలని గ్రామస్తులు అందరు కలిసి గంగమ్మ దేవతకు నీళ్లు పోశారు,రాష్ట్రంలో వర్షం లేక రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని వర్షం కురవాలని గంగమ్మ తల్లిని వేడుకున్నారు వర్షం లేనందువలన నాటిన పంటలు ఎండిపోతున్నాయి అని రైతులు ఆ గంగమ్మ తల్లికి వర్షం కురిసేలా గంగమ్మ తల్లిని గ్రామస్తులు గంగమ్మ తల్లికి 11 బిందెల నీళ్లు పోశారు

# ఎస్ ఐ ఆర్ ఓటరు ధృవీకరణ కార్యక్రమం



**కల్లూరు జులై 11 (రిపబ్లిక్ న్యూస్)**శనివారం రోజునంద్యాల జిల్లా అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆదేశాల మేరకు సాయంకాలం SIR ఓటరు ధృవీకరణ కార్యక్రమం లో భాగంగా కృష్ణానగర్ 67 సచివాలయం కి వచ్చిన MRO గారితో పాటు పాల్గోన్న ఓర్వకల్ టీడీపీ మండల అధ్యక్షులు నాగిరెడ్డి ,26,27 వార్డు క్లస్టర్ ఇంచార్జి చరణ్ యాదవ్ , AERO జకీర్,మరియు దీూా లు BLA లు, బూత్ ఇంచార్జులు కంకర శ్రీనివాసులు,పవన్, రాజేష్, శ్రీను, భాస్కర్ మరియు వార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార కేంద్రమే ప్రజా దర్బార్

## ముక్కా రూపానంద రెడ్డి.






**రైల్వే కోడూరు జూలై 11 రిపబ్లిక్ న్యూస్.**

రైల్వే కోడూరునియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కార కేంద్రమే ఈ ప్రజా దర్బార్ అని కూడా చైర్మన్, రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కా రూపానంద రెడ్డి ప్రజా దర్బార్ ఉద్దేశించి ప్రసంగించారు, రైల్వే కోడూరు మండలం రాఘవరాజుపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రజా దర్బారులో ఆయన పాల్గొని నియోజకవర్గంలోని అన్ని మండలాలనుంచి వచ్చిన రైతులు ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించి వాటిని పరిశీలించిన అనంతరం సంబంధిత శాఖ అధికారులకు వినతులను అందజేసి సత్వరమే పరిష్కారమయ్యే వినతులను పరిష్కరించాలని అధికారులకు సూచించారు సత్వరమే పరిష్కారం కానీ సమస్యలను పై అధికారులతో చర్చించి సాధ్యసాద్యాలను పరిశీలించి రైతులకు ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని ఆయన వారిని కోరారు, ఈ కార్యక్రమంలో కామ్రేడ్ జ్యోతి చిన్నయ్య పాల్గొని పేద బడుగు బలహీన వర్గాల ఎస్సీ ఎస్టీ భూముల అన్ని అకంతం ప్రభుత్వ భూముల ఆక్రమణ వంటి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడం జరిగినది ఆయన సానుకూలంగా స్పందించి పరిశీలిస్తానని ఆయనకు తెలియజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో ముక్కారూపానంద రెడ్డి సతీమణి టిడిపి నియోజకవర్గ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మి పాల్గొన్నారు. ముఖ్యంగా యువత ఉద్యోగ సమస్యలు,రోడ్ల సమస్యలు, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలను సైతం ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో వినతుల రూపంలోరావడం జరుగుతోందని ఈ సమస్యలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించి రెండవ శనివారం అధికారులు అందుబాటులో లేనప్పటికీ సంబంధిత అధికారులకు చరవాణి ద్వారా సంప్రదింపులు జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు తెలపడం జరిగింది. ఇతర సమస్యలకు సంబంధించి కూడా విచ్చేసిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరిష్కార మార్గం చూపడం జరుగుతుందన్నారు అనంతరం ముక్కారూపానంద రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారం కొరకు గత కొన్ని నెలలుగా టిడిపి కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ప్రజాదర్బార్ కార్యక్రమం రైల్వే కోడూరు నియోజకవర్గంలో మన పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని వారి సమస్యలను పరిష్కరించుట కొరకు నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అందులో భాగంగా నేడు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం ఇందులో పలు సమస్యలు నా దృష్టికి రావడం వాటిని త్వరితగతిన అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయడం జరిగిందని తెలియజేస్తూ, ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి మరియు విద్యాశాఖ మంత్రి టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు కి ఈ సందర్భంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.





# అర్హులెవరూ ఓటు కోల్పోకూడదు: ఈఆర్వో చల్లా ఓబులేసు

### ప్రత్యేక శిబిరాలకు విశేష స్పందన 172 పోలింగ్ కేంద్రాల తనిఖీ 81.24 శాతానికి చేరిన డిజిటలైజేషన్

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 11)**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యత అని, అర్హులెవరూ ఓటు హక్కును కోల్పోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో), నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు.

భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక శిబిరాలను ఆయన విస్తృతంగా పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన 172 పోలింగ్ కేంద్రాలను సుడిగాలి పర్యటన చేసి శిబిరాల నిర్వహణ, ఓటర్ల స్పందన, ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ ప్రక్రియ, ఓటర్లకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రత్యేక శిబిరాలకు మొదటి రోజు ఓటర్ల నుంచి విశేష స్పందన లభించిందని ఈఆర్వో తెలిపారు. ఇప్పటివరకు



ఎన్యూమరేషన్ ఫారం అందని వారు, ఫారం అందుకున్నప్పటికీ ఇంకా సమర్పించని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తప్పనిసరిగా తమ ఫారాలను సమర్పించాలని కోరారు.

ఆదివారం కూడా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు కొనసాగనున్నందున, ఇంకా ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు తమ సమీప పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.



ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 81.24 శాతానికి చేరుకుందని, ఫారాల పంపిణీ 99.94 శాతం పూర్తయిందని చల్లా ఓబులేసు వెల్లడించారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఓటర్లు తమ బూత్ స్థాయి అధికారి (బీఎల్వో) వివరాలను తెలుసుకొని ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమయపాలనతో పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు.

# కర్నూలు బస్టాండ్‌లో బంగారు గొలుసుల చోరీ కేసులు ఛేదన

### ఇద్దరు మహిళల అరెస్ట్ 6.5 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం; సీసీటీవీ ఆధారాలతో నిందితుల పట్టివేత

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 11)**

కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో జరిగిన రెండు బంగారు గొలుసుల చోరీ కేసులను కర్నూలు నాల్గవ పట్టణ పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ఈ కేసులకు సంబంధించి ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి సుమారు 6.5 తులాల బరువున్న రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నట్లు నాల్గవ పట్టణ సీఐ విక్రమసింహా తెలిపారు.



పోలీసుల వివరాల ప్రకారం, జూన్ 11న గిద్దలూరుకు వెళ్లేందుకు కర్నూలు బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. అదే విధంగా పెద్దపాడుకు చెందిన ఓ బ్యాంకు ఉద్యోగిని విధులకు వెళ్లేందుకు బస్టాండ్‌లో వేచి ఉన్న సమయంలో ఆమె మెడలోని బంగారు గొలుసును కూడా దొంగిలించారు. బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసులు, ఈ చోరీలకు తమిళనాడు రాష్ట్రంలోని జోలార్పేటకు చెందిన భాగ్య, హన్నమ్మ అనే మహిళలు పాల్పడినట్లు గుర్తించారు.

నిందితులు ప్రస్తుతం బెంగళూరు, కుప్పం ప్రాంతాల్లో సంచరిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో నాల్గవ పట్టణ సీఐ విక్రమసింహా ఆధ్వర్యంలో ఎస్ఐ శరత్ కుమార్, పోలీసు సిబ్బంది సుబ్బరాయుడు, మురళితో కూడిన ప్రత్యేక బృందం కుప్పం వెళ్లి ప్యాలెస్ రోడ్ ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసింది.వారి వద్ద నుంచి చోరీకి గురైన రెండు బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నామని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని సీఐ విక్రమసింహా తెలిపారు.

# ఖరీఫ్-2026 సాగును వేగవంతం చేసి లక్ష్యాలను అధిగమిద్దాం

## రైతులకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూలై 11( రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల జిల్లాలో ఖరీఫ్-2026 సీజన్ వ్యవసాయ పనులు సజావుగా కొనసాగుతున్నాయని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సేవలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందించేందుకు వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని శనివారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. జిల్లాలో ఖరీఫ్-2026 సీజన్‌లో మొత్తం 2,20,230 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయడమే లక్ష్యంగా నిర్ణయించగా, జూలై 10 నాటికి 64,535 హెక్టార్లలో సాగు పూర్తై, గత ఖరీఫ్ ఇదే కాలంతో పోలిస్తే గణనీయమైన పురోగతి నమోదైందన్నారు. గత ఏడాది ఇదే సమయానికి 40,785 హెక్టార్లలో మాత్రమే సాగు ఉండగా, ఈ ఏడాది దాదాపు 23,750 హెక్టార్లు అధికంగా సాగు నమోదవడం రైతుల ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు కేటాయించిన 54,488 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువులలో, జూలై 11 నాటికి 49,783 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 35,560 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువుల నిల్వలు ఉండగా, అవసరానికి అనుగుణంగా సరఫరా



కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 14,223 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువులను రైతులు వినియోగించుకున్నారని తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో 933 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్ గోదాములలో 17,279 మెట్రిక్ టన్నులు, రిటైల్/ హోల్ సేల్ విక్రయ కేంద్రాలలో 17,348 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువుల నిలువలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా బయోమెట్రిక్ విధానం ద్వారా ఎరువుల పంపిణీ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ఎరువులను నిర్ణీత ధరలకే విక్రయించేలా ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామని, అధిక ధరలకు విక్రయించడం, అక్రమ నిల్వలు, నకిలీ ఎరువుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వివరించారు. జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాలు, ఎరువుల విక్రయ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి కొరత లేకుండా అవసరమైన నిల్వలు ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎవరైనా డీలర్లు కృత్రిమ కొరత సృష్టించిన లేదా మళ్ళింపులకు పాల్పడినా ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం వారి లైసెన్సులు రద్దుచేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అత్యధికంగా మొక్కజొన్న 20,039 హెక్టార్లు, కంది 18,252 హెక్టార్లు, మినుము 8,370 హెక్టార్లు, సోయాబీన్ 6,004 హెక్టార్లు, పత్తి 5,205 హెక్టార్లు విస్తీర్ణంలో సాగు జరిగినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే వేరుశనగ 3,131 హెక్టార్లు, సజ్జ 1,901 హెక్టార్లు, ఆముదం 1,050 హెక్టార్లు, కొర్ర 279 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 152 హెక్టార్లు, వరి 118 హెక్టార్లు, చెరకు 18 హెక్టార్లు, పెసలు 16 హెక్టార్లలో సాగు నమోదైందన్నారు. వర్ష పరిస్థితులకు అనుగుణంగా రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని ఆమె సూచించారు. ఖరీఫ్ సీజన్‌ను విజయవంతం చేయడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఎస్ఐఆర్ - 2026 ప్రక్రియను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలి

## ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్‌లో ఖచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

## పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా







**నంద్యాల బ్యూరో, జూలై 11 (రిపబ్లిక్ న్యూస్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా వేగవంతంగా, పారదర్శకంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఎం.ఎస్. నగర్ ప్రాంతంలో కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 111 నుంచి 115 వరకు, అలాగే 125వ పోలింగ్ స్టేషన్ పరిధిలో చేపడుతున్న డిజిటలైజేషన్ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించి, నమోదు ప్రక్రియ, డేటా అప్‌లోడ్ విధానం, పత్రాల ధృవీకరణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో ప్రతి ఎన్యూమరేషన్ ఫారమ్‌ను అత్యంత జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదులో ఖచ్చితత్వం అత్యంత కీలకమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ఎన్నికల జాబితాపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. అనంతరం నంద్యాల పట్టణంలోని 108, 149 నుంచి 152 వరకు ఉన్న పోలింగ్ కేంద్రాలను కూడా జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్-2026 కార్యక్రమం అమలు తీరును పరిశీలించి, ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సేకరణ, డిజిటలైజేషన్, రికార్డుల నిర్వహణ, పెండింగ్ వివరాల పరిష్కారం వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటలైజేషన్‌ను నిర్దేశించిన కాలపట్టిక ప్రకారం వేగవంతం చేయడంతో పాటు, ప్రతి నమోదును క్షుణ్ణంగా పరిశీలించి మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి, ప్రతిరోజూ నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని, పెండింగ్ లేకుండా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమం విజయవంతం కావడానికి అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తు.చ తప్పకుండా అమలు చేస్తూ ప్రజలకు పారదర్శకమైన, విశ్వసనీయమైన ఓటరు జాబితా అందించే దిశగా కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, నంద్యాల అర్బన్ తహశీల్దార్ శ్రీనివాసులుతో పాటు సంబంధిత ఎన్నికల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కర్నూలు జిల్లాలో యూరియా కొరతకు తావులేదు

## 28,540 మెట్రిక్ టన్నుల నిల్వలు అందుబాటులో

## ఏపీఐఎంఎస్ యాప్‌తో పారదర్శక పంపిణీ 70 వేల మంది రైతులకు యూరియా పంపిణీ

## అక్రమాలపై కఠిన చర్యలు ( తాగునీటి సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు: కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 11)** జిల్లాలో యూరియా సరఫరా సజావుగా కొనసాగుతోందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో రవాణాలో ఉన్న నిల్వలతో కలిపి 28,540 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా పంపిణీలో పారదర్శకతను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీఐఎంఎస్ యాప్‌ను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు.



కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌కు జిల్లాకు 45,599 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా ఇప్పటివరకు 17,900 మెట్రిక్ టన్నులు వినియోగించబడినట్లు తెలిపారు. దాదాపు 70 వేల మంది రైతులు ఇప్పటికే యూరియాను కొనుగోలు చేసి వినియోగించుకున్నారని వెల్లడించారు. ఎరువుల పంపిణీలో అక్రమాలు, పక్కదారి మళ్లింపులు, పరిశ్రమలకు తరలింపు వంటి చర్యలను అరికట్టేందుకు ఏపీఐఎంఎస్ యాప్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతు ఆధార్ నమోదు చేసిన వెంటనే ఓటీపీ ఆధారంగా రైతు వివరాలు, భూమి విస్తీర్ణం, సాగు పంట, అర్హత మేరకు ఎరువుల వివరాలు యాప్‌లో కనిపిస్తాయని చెప్పారు. చిన్న, సన్నకారు రైతులకు మొదటి విడతలోనే పూర్తి కోటా అందజేస్తుండగా, పెద్ద రైతులకు అవసరాన్ని బట్టి విడతల వారీగా ఎరువులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. యూరియా పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 537 ఎరువుల విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన 96 కేంద్రాలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని చెప్పారు. 20 మంది డీలర్ల లైసెన్సులను సస్పెండ్ చేయడంతో పాటు 11 మంది డీలర్లపై ఎసెన్షియల్ కమోడిటీస్ చట్టం కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో రూ.26 లక్షల విలువైన 45 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేయగా, రూ.85 లక్షల విలువైన 412 మెట్రిక్ టన్నుల ఎరువులను డిటైన్ చేసినట్లు తెలిపారు. యూరియా కొనుగోలుకు రైతులను బలవంతంగా ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేసే డీలర్లపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా అక్రమాలు గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. వ్యవసాయ రంగంలో ప్రధాన పంటలతో పాటు అంతర పంటలను కూడా ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానం రైతులకు లాభదాయకమని పేర్కొంటూ, జిల్లాలో 92 వేల ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటికే 83 వేల ఎకరాల్లో ఈ పద్ధతిలో సాగు జరిగిందని వెల్లడించారు.

**తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. తుంగభద్ర డ్యామ్ నుంచి 2 టీఎంసీల నీటిని విడుదల చేయాలని అధికారులను కోరామని, మరో వారం రోజుల్లో నీటి సరఫరా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి కార్యాలయం నిరంతరం సమీక్ష నిర్వహిస్తోందన్నారు.

అత్యవసర తాగునీటి అవసరాల కోసం పాత డెడ్ అకౌంట్ల నుంచి రూ.3 నుంచి రూ.4 కోట్లు సమీకరించామని, మంత్రాలయం బోర్‌వెల్‌లకు రూ.1.10 కోట్లు, ఆలూరు నియోజకవర్గ తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు చెప్పారు. అదనంగా వాటర్ బాడీస్ పునరుద్ధరణ పనులకు రూ.1.50 కోట్లు మంజూరు చేయించామని తెలిపారు.

తాగునీటి సమస్యలను అధిగమించేందుకు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను కూడా వినియోగించనున్నట్లు వెల్లడించారు. సమస్యలపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ఫిర్యాదులు వచ్చిన వెంటనే ప్రత్యేక బృందాలను పంపించి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి ఆటంకంగా మారిన విద్యుత్ స్తంభాలు తొలగించాలి

## సోమయాజులపల్లె గ్రామరైతు కె.సుబ్బారాయుడు విజ్ఞప్తి

**ఓర్వకల్లు ప్రతినిధి,జూలై 11(రిపబ్లిక్ న్యూస్)** ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె గ్రామానికి చెందిన రైతు కె. సుబ్బారాయుడు తన వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాల వల్ల పొలంసాగు పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.రైతు తెలిపిన వివరాల ప్రకారం, సర్వే నెం. 299లోని తన వ్యవసాయ భూమిలో మొత్తం ఐదు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయగా, వాటిలో రెండు స్తంభాలు అత్యంత సమీప దూరంలో ఉండటంతో ట్రాక్టర్లు,





వ్యవసాయ యంత్రాలు సక్రమంగాతిరగలేకపోతున్నాయి. దుక్కి పనులు, విత్తనాలు వేయడం, నీటి పారుదల, పంట సంరక్షణ, కోత వంటి వ్యవసాయ కార్యకలాపాల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయన తెలిపారు.ఈ పరిస్థితి కారణంగా భూమి వినియోగ సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు వ్యవసాయ వ్యయాలు పెరిగి, పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతోందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న నేపథ్యంలో, ఇలాంటి సమస్యలు రైతుల ఆదాయంపై ప్రభావం చూపడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకతను కూడా తగ్గించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, వ్యవసాయ కార్యకలాపాలకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సాంకేతికంగా సాధ్యమైన మేరకు భూమి సరిహద్దుల వైపు పునర్వ్యవస్థీకరించే చర్యలు చేపట్టాలని రైతు కె. సుబ్బారాయుడు కోరారు. గ్రామంలోని రైతులు కూడా ఈ సమస్యను సానుకూలంగా పరిశీలించి, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి మరియు సాగు సౌలభ్యాన్ని పరిరక్షించే దిశగా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు

# విలేకరి బి.నగేష్ మృతిపై ఏపీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

**అనంతపురం క్రైమ్, జూలై 11,(రిపబ్లిక్ న్యూస్):** శింగనమల నియోజకవర్గానికి చెందిన ఆంధ్రజ్యోతి సీనియర్ రిపోర్టర్ బి.నగేష్ ఆకస్మిక మరణం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు, అధ్యక్షుడు షఫీఉల్లా, అనంతపురం నగరాధ్యక్షుడు కేశవ, నగర్ ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర ఆధ్వర్యంలో(ఏపీడబ్ల్యూజేఎఫ్) అనంతపురం నగర శాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఎన్నో ఏళ్లుగా పత్రికా రంగంలో నిబద్ధతతో సేవలందించిన నగేష్ మరణం జర్నలిస్టు లోకానికి తీరని లోటని సంఘం పేర్కొంది.



**జర్నలిస్టు సమాజం ఒక మంచి సహచరుడిని కోల్పోయింది**

ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ నగేష్ అంకితభావం కలిగిన పాత్రికేయుడని, ఆయన ఆకస్మిక మరణం చాలా బాధాకరమన్నారు. జర్నలిస్టు సమాజం ఒక మంచి సహచరుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.మృతుడు నగేష్ కుటుంబ సభ్యులకు ఏపీడబ్ల్యూజేఎఫ్ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మస్థైర్యం కోసం ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు.

# పవన్ కళ్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స

## ముంబైలో వైద్యుల సమక్షంలో ఆపరేషన్

## ప్రకటన విడుదల చేసిన డిప్యూటి సిఎం కార్యాలయం



**అమరావతి,జులై 11 (రిపబ్లిక్ న్యూస్) ::** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శనివారం ముంబైలోని ఓ ఆస్పత్రిలో భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డాక్టర్ దిన్‌షా పార్థీవాలా నేతృత్వంలోని వైద్యుల బృందం ఈ శస్త్రచికిత్సను నిర్వహించారని తెలిపారు. పవన్ కల్యాణ్‌కు రెండు భుజాల్లోనూ తీవ్రమైన రోటేటర్ కఫ్ గాయాలు ఉన్నట్లు నిర్ధారించారని చెప్పారు. రోటేటర్ కఫ్ చిరగడంతో పాటు, ఆయన కుడి భుజంలో అవల్షన్ ఫ్రాక్చర్ ఏర్పడటంతో ఓ పెద్ద శస్త్రచికిత్స అవసరమైందని అన్నారు. ఆయన కుడి భుజానికి చేసిన ఈ శస్త్రచికిత్స సుమారు మూడున్నర గంటల పాటు కొనసాగించారని.. ఈ సర్జరీ విజయవంతంగా పూర్తయిందని అధికారులు తెలిపారు. పవన్ కల్యాణ్‌ను ఆపరేషన్ అనంతరం రికవరీ గదికి తరలించారని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి అనస్థీషియా ప్రభావం నుంచి బాగా కోలుకుంటున్నారని చెప్పారు. చికిత్స అందిస్తున్న వైద్య బృందం నిశిత పర్యవేక్షణలో డిప్యూటీ సీఎం ఉన్నారని వెల్లడించారు. వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయించుకోవాలని వైద్య నిపుణులు సలహా ఇచ్చారని అన్నారు. ముందుగా తన అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని, పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకోవడానికి ముందే వాటిని పూర్తి చేయాలని నిర్ణయించారని చెప్పారు. రెండు భుజాలకు ఒకేసారి శస్త్రచికిత్స చేయడంతో ఆపరేషన్ తర్వాత గణనీయమైన అసౌకర్యం, కదలిక పరిమితి ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ఈ క్రమంలో వైద్య బృందం మొదట కుడి భుజానికి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించిందని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ తగినంత కోలుకున్న తర్వాత ఎడమ భుజానికి శస్త్రచికిత్స చేయాలని ప్రణాళిక చేశారని అధికారులు తెలిపారు. ఆయన అవిశ్రాంత ప్రజా కార్యక్రమాలు, విస్తృత

రాజకీయ పర్యటనలు, ఎన్నికల ప్రచారాలు, పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో నిరంతర సంభాషణల కారణంగా, 2016లో అయిన ఈ భుజం గాయాలు సంవత్సరాలు గడిచేకొద్దీ క్రమంగా తీవ్రమయ్యాయని వెల్లడించారు. నిరంతర నొప్పిని భరిస్తున్నప్పటికీ, ఉప ముఖ్యమంత్రి ఎలాంటి అంతరాయం లేకుండా తన అధికారిక బాధ్యతలను నిర్వర్తిస్తూ, ప్రజా కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉన్నారని అన్నారు. పవన్ కల్యాణ్ కోలుకోవడానికి సంబంధించిన మరిన్ని వివరాలు తగిన సమయంలో తెలియజేస్తామని డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు పేర్కొన్నారు.

# ఖరీఫ్ కు ఎరువులు అందుబాటులో ఉంచాం

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి -జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్



**శ్రీ సత్య సాయి ప్రతినిధి, జూలై 11, (రిపబ్లిక్ న్యూస్):** శ్రీ సత్యసాయి జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన అన్ని రకాల ఎరువులను సమృద్ధిగా అందుబాటులో ఉంచామని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ తెలిపారు. రైతులకు సకాలంలో ఎరువులు అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 19,602 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయని వెల్లడించారు. వీటిలో 9,308 మెట్రిక్ టన్నుల యూరియా, 2,481 మెట్రిక్ టన్నుల డీఏపీ, 795 మెట్రిక్ టన్నుల ఎంఓపీ, 5,612 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఏపీ ఏ ఐ ఎం ఎస్ 2.0 విధానం ద్వారా పంట విస్తీర్ణానికి అనుగుణంగా రైతులకు యూరియా, డీఏపీ ఎరువులు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ విధానంతో బ్లాక్ మార్కెటింగ్‌కు అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 20,070 మంది రైతులు 52,295 యూరియా సంచులు, 18,582 డీఏపీ సంచులను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే, స్వల్పకాలంలో దిగుబడి ఇచ్చే కంది, ఆముదం, జొన్న, సజ్జ, కొర్ర, అలసంద వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు.ఎరువుల పంపిణీ, ప్రత్యామ్నాయ పంటలు లేదా వ్యవసాయానికి సంబంధించిన సందేహాలు, ఫిర్యాదుల కోసం పుట్టపర్తిలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు 8331057715 హెల్ప్‌లైన్‌ను వినియోగించుకుని ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఆకస్మిక తనిఖీ

## తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య



**శ్రీ సత్యసాయి/హిందూపురం, జూలై 11,(రిపబ్లిక్ న్యూస్ ):** హిందూపురం నియోజకవర్గంలోని హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ నమోదు ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటలైజేషన్ కేంద్రాలను సందర్శించి నమోదు రికార్డులు, డేటా ఎంట్రీ విధానాన్ని పరిశీలించారు.

**గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలి**

ఈ సందర్భంగా డేటా నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అత్యంత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రతి నమోదును క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితత్వంతో డేటా నమోదు చేయాలని తెలిపారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వానికి తావివ్వొద్దని, తప్పిదాలు వెలుగులోకి వస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు.తనిఖీల్లో హిందూపురం మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎన్నికల విభాగం సూపర్‌వైజర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తీక్షణ్ సాయి పుట్టినరోజు వేడుకలు

## వృద్ధాశ్రమంలో అన్నదానం



**అనంతపురం సంక్షేమం, జూలై 11,(రిపబ్లిక్ న్యూస్):**యువతలో సేవా భావాన్ని పెంపొందించే లక్ష్యంతో తీక్షణ్ సాయి తన పుట్టినరోజు సందర్భంగా అనంతపురం నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న సురక్ష వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వృద్ధాశ్రమంలోని వృద్ధులకు భోజనాలను స్వయంగా వడ్డించి జన్మదిన వేడుకలను అర్థవంతంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో తీక్షణ్ సాయితో పాటు ఆయన స్నేహితులు ధీరజ్, చరణ్, డాన్స్ మాస్టర్ వినోద్ తదితరులు పాల్గొని సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

**తల్లిదండ్రులకు బిడ్డలు చూపించే ప్రేమ అమూల్యం** ఈ సందర్భంగా సురక్ష వృద్ధాశ్రమం నిర్వాహకులు ఈ. రామకృష్ణయ్య మాట్లాడుతూ, పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు దూరంగా సమాజానికి ఉపయోగపడే విధంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. నేటియువతలో మానవత్వం, సామాజిక బాధ్యతలను పెంపొందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు.సమాజ సేవలో ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. పండు వయసులో ఆప్యాయత, ఆదరణ కోసం ఎదురుచూసే తల్లిదండ్రులకు బిడ్డలు చూపించే ప్రేమ, అనురాగం అమూల్యమని చెప్పారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని ఆయన అభినందించారు.

# జోరుగా దొంగలు చోరీలు

## యమ స్పీడు పెంచిన పోలీసులు - 25 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

## మీడియాకు వివరాలు వెల్లడించిన అడిషనల్ ఎస్పీ








**అనంతపురం క్రైమ్, జులై 11,(రిపబ్లిక్ న్యూస్):** ఇళ్ల ముందు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాల వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను జోరుగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అనంతపురం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సాయంత్రం రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ లో అదనపు ఎస్పి మహబూబ్ బాషా, డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.

**ద్విచక్ర వాహనాల విలువ సుమారు రూ. 19 లక్షలు**

ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడుతూ నగరంలో ద్విచక్ర వాహనాలను దొంగలించిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 25 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.19 లక్షల విలువ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి అర్బన్ అదనపు ఎస్పీ ఎస్. మహబూబ్ బాషా పర్యవేక్షణలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించడంతో ద్విచక్ర వాహన నిందితులు పట్టుబడ్డారని తెలియజేశారు.టూ టౌన్ పోలీసులు నాయక్‌నగర్ రైల్వే గేట్ సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారు కల్యాణదుర్గం రోడ్డుకు చెందిన బండారు మురళీకృష్ణ, ఆర్.కే. నగర్‌కు చెందిన హన్నూర్ షేక్ అలీ అక్బర్గా గుర్తించారు. విచారణలో ఇద్దరూ పలు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పి. జగదీష్ అభినందించారు

నిందితులు అనంతపురం నగరంతో పాటు తాడిపత్రి, గుంతకల్, పెనుకొండ, కదిరి ప్రాంతాల్లోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కూడా బైక్‌లను చోరీ చేసినట్లు వెల్లడించారు. ఎక్కువ రద్దీ ఉండే ఆసుపత్రులు, ఇళ్ల ముందు, దుకాణాల సమీపంలో పార్క్ చేసిన వాహనాలను ముందుగా గుర్తించి, క్షణాల్లో ఎత్తుకెళ్లడం వీరి నేరపద్ధతిగా పోలీసులు గుర్తించారు. అందులో భాగంగా నిందితులు దాచిన 25 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు. చాకచక్యంగా వ్యవహరించి ద్విచక్ర వాహనాల దొంగల కేసును ఛేదించిన టూ టౌన్ సీఐ కె. పుల్లయ్య, ఎస్ఐలు రుషేంద్రబాబు, రామకృష్ణతో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ పి. జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు వాహనాలను నిర్లక్ష్యంగా పార్క్ చేయకుండా తాళాలు వేసి భద్రతా చర్యలు పాటించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 62,225 కేసుల పరిష్కారం

## బాధితులకు రూ.15.11 కోట్ల పరిహారం- రైతుల వారసులకు రూ.42 లక్షల నష్టపరిహారం









**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 11)** రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొత్తం 62,225 కేసులు పరిష్కారమయ్యాయి.ఈ సందర్భంగా 200 మోటార్ ప్రమాద కేసుల్లో బాధితులకు రూ.15,11,43,507లను ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా నష్టపరిహారంగా అందజేశారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టు భూసేకరణ కారణంగా నష్టపోయిన 96 మంది రైతుల వారసులకు రూ.42 లక్షల నష్టపరిహారం మంజూరు చేశారు.జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ, ఉమ్మడి రెండు జిల్లాల్లో 31 బెంచీలను ఏర్పాటు చేసి 548 సివిల్ కేసులు, 61,292 క్రిమినల్ కేసులు, 289 బ్యాంకు కేసులు సహా మొత్తం 62,225 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీబీఐ కోర్టు అదనపు జిల్లా జడ్జి శోభారాణి, ఆరవ అదనపు జిల్లా జడ్జి వాసు, ఏడవ అదనపు జిల్లా జడ్జి లక్ష్మీరాజ్యం, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్, కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రుడు, రిటైర్డ్ అదనపు జిల్లా జడ్జి లక్ష్మీనరసింహారెడ్డి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మల్లేశ్వరి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ, ఎక్సైజ్ కోర్టు జడ్జి అనిల్ కుమార్, మొబైల్ కోర్టు జడ్జి అనూష, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపర్ణ, కోర్టు మానిటరింగ్ సీఐ రామానాయుడు, న్యాయవాదులు, బ్యాంకు, బీఎస్ఎన్ఎల్, పంచాయతీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మూగబోయిన కోకిల గానం

## అయిదు దశాబ్దాల సంగీత ప్రస్థానానికి ముగింపు -కోట్లాది హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన ఎస్. జానకి



**అమరావతి, జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :** భారతీయ సినీ సంగీత ప్రపంచాన్ని తన అపూర్వ గానమాధుర్యంతో మైమరపించిన ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి ఇకలేరు. దక్షిణాది సినీ సంగీతానికి సజీవ చరిత్రగా నిలిచిన ఆమె శనివారం రాత్రి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో మైసూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె తుదిశ్వాస విడిచారు. ఆమె వయసు 88 సంవత్సరాలు. ఈ వార్తతో తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణ భారత సినీ, సంగీత ప్రపంచం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.1938 ఏప్రిల్ 23న గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో జన్మించిన జానకి.. చిన్ననాటి నుంచే సంగీతంపై ఆసక్తి పెంచుకున్నారు. అసాధారణమైన గాత్ర మాధుర్యం, భావ వ్యక్తీకరణ, స్వర వైవిధ్యంతో సినీ సంగీత రంగంలో అడుగుపెట్టి, తక్కువ కాలంలోనే అగ్రగాయనిగా ఎదిగారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం భాషలతో పాటు పలు భారతీయ భాషల్లో కలిపి దాదాపు 50 వేలకుపైగా పాటలు ఆలపించి అరుదైన రికార్డు నెలకొల్పారు. అందుకే అభిమానులు ఆమెను ప్రేమగా "సౌత్ ఇండియన్ నైటింగేల్" అని పిలిచేవారు.

**ఇళయరాజా గీతాలకు ఆమె గొంతు ప్రాణం పోసింది**

ఐదు దశాబ్దాలకు పైగా సాగిన ఆమె సంగీత ప్రయాణంలో ఎన్నో అపురూపమైన గీతాలు జన్మించాయి. ప్రేమ, విరహం, భక్తి, జానపదం, శాస్త్రీయ సంగీతం.. ఏ భావాన్నైనా తన స్వరంలో ఒదిగి పాడగల అరుదైన ప్రతిభ ఆమె సొంతం. సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరపరిచిన ఎన్నో చిరస్మరణీయ గీతాలకు ఆమె గొంతు ప్రాణం పోసింది. అలాగే గానగంధర్వుడు ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యంతో కలిసి పాడిన వేలాది యుగళగీతాలు నేటికీ సంగీతాభిమానులను అలరిస్తూనే ఉన్నాయి.

తన గాన ప్రతిభకు గుర్తింపుగా జానకి నాలుగు జాతీయ ఉత్తమ గాయని పురస్కారాలు, 30కి పైగా రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్నారు. అవార్డులు, సన్మానాలు ఎన్నో అందుకున్నా, సాధారణ జీవనశైలిని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. వినయం, నిరాడంబరత ఆమె వ్యక్తిత్వానికి చిరునామాలుగా నిలిచాయి.

**భారతీయ సినీ సంగీత రంగం ఓ అమూల్యమైన స్వరాన్ని కోల్పోయింది**

వ్యక్తిగత జీవితంలో ఇటీవల వరుస విషాదాలు ఆమెను తీవ్రంగా కలచివేశాయి. ఈ ఏడాది జనవరి 22న కుమారుడు మురళీకృష్ణ మృతి చెందడంతో జానకి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఆ దుఃఖం నుంచి పూర్తిగా కోలుకోకముందే ఆరోగ్యం మరింత క్షీణించింది. చివరకు వృద్ధాప్య సమస్యలతో పోరాడుతూ ఆమె శాశ్వత నిద్రలోకి జారుకున్నారు.ఎస్. జానకి మరణంతో భారతీయ సినీ సంగీత రంగం ఓ అమూల్యమైన స్వరాన్ని కోల్పోయింది. ఆమె ఆలపించిన వేలాది పాటలు తరతరాలకు సంగీతానందాన్ని పంచుతూనే ఉంటాయి. గాన కోకిల స్వరం మూగబోయినా.. ఆమె గానం మాత్రం ఎప్పటికీ అమరగానంగా సంగీతాభిమానుల హృదయాల్లో మారుమోగుతూనే ఉంటుంది.

## సాయికృష్ణ విచారణలో అడ్డంకిగా నిబంధనలు

### సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసిన ప్రభుత్వం



**అమరావతి, జులై 11 (రిపబ్లిక్ న్యూస్):** సాయికృష్ణ లాకప్ డెత్ కేసు విచారణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కృష్ణలంక మాజీ సీఐ నాగరాజు పోలీస్ కస్టడీపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సిట్ సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సీఐ నాగరాజు కస్టడీ విచారణపై హైకోర్టు విధించిన కఠిన నిబంధనలపై ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. నిందితుడి ట్రాన్సిట్ సమయంలో పూర్తి నిడివి వీడియో రికార్డింగ్ చేయాలన్న షరతును సిట్ అధికారులు వ్యతిరేకిస్తున్నారు. నిరంతర వీడియో నిఘా వల్ల దర్యాప్తు గోప్యత దెబ్బతినే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. సాయికృష్ణ మృతదేహం అన్వేషణ, సీన్ రికన్‌స్ట్రక్షన్‌కు హైకోర్టు కండీషన్లు అడ్డంకిగా మారాయని పేర్కొంటూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేసింది. నిందితుడిని ఎటువంటి కఠిన షరతులు లేకుండా విచారించేందుకు అనుమతించాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. కాగా, విజయవాడలో సంచలనం సృష్టించిన కస్టోడియల్ డెత్ కేసులో నిజాలు రాబట్టేందుకు సుప్రీంకోర్టు తీర్పు కీలకంగా మారింది. సిట్ వేసిన ఈ పిటిషన్ వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం ఉంది.

# గందరగోళంగా సర్ ప్రక్రియ !

**అమరావతి, జులై 11 (రిపబ్లిక్ న్యూస్):**
సర్ ప్రక్రియలో గందరగోళం కనిపిస్తోంది. బిఎల్‌వోలు ఎక్కడా సరిగా కనిపించడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో గేటెడ్ కమ్యూనిటీల్లో వారి ఆచూకీ లేదు. కనీసం సంప్రదించిన దాఖలాలు లేవు.
మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సర్ తుది అంకానికి చేరుకుంది. అధికారికంగా 14వ తేదీ ఆఖరు గడువు అయినా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు అందజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. డిజిటలైజేషన్‌కు సమయం కావాల్సి ఉండడంతో అధికారులు ముందస్తు జాగ్రత్త తీసుకుంటున్నారు. మరోవైపు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నా ప్రజల్లో ఆశించిన స్పందన రావడం లేదని అధికారులు వాపోతుండగా ఆ ఫారాలను పూరించడం కష్టతరమని రాజకీయ పార్టీల ఏజెంట్లు వ్యాఖ్యానిస్తున్నారు. 'సర్' పక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చివరి రోజులు సర్వర్ సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఒక వ్యక్తికి ఒక్కచోటే ఓటు ఉండాలని.. అలాకాకుండా రెండు, అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటు ఉంటే అది చట్టవిరుద్ధమని తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. అలా ఉంటే ఏడాది జైలు శిక్ష, జరిమానా పడుతుందని హెచ్చరించారు. ఇదంతా ఒక ఎత్తయితే ప్రవాసుల ఓట్ల గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది జీవనోపాధి కోసం విదేశాల్లో ఉంటున్నారు. వారు అడపాదడపా వచ్చి వెళుతుంటారు. వారి గురించి ఎన్నికల సంఘం తెలియ చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలోని ఓటరు జాబితా ఆధారంగా.. ఎవరికైనా రెండు చోట్ల ఓటు ఉంటే



గుర్తించగలుగుతారు. అదే రెండు రాష్ట్రాల్లో ఉంటే దాన్ని ఈసీఐ గుర్తించాల్సి ఉంటుంది. ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని అంటున్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి రెండు చోట్లా ఓటుహక్కు పొందినవారికి ఈసీఐ జారీచేసే నోటీస్ ఆధారంగా... ఏడాది జైలు శిక్షతో పాటు పెనాల్టీ కూడా పడుతుందని సీఈవో హెచ్చరించారు. 'సర్' ముఖ్య ఉద్దేశం.. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడం, ఇతర తప్పులను సరిదిద్ది జాబితాను పూర్తిస్థాయిలో ఆధునీకరించడం లక్ష్యం. ప్రతి ఒక్క ఓటరూ ఈ పక్రియలో పాల్గొనాల్సిందేనని.. సాధారణ పౌరుల నుంచి సీఎం, పీఎం దాకా ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ ఫారం నింపాల్సిందేనని.. ఎవరికీ మినహాయింపులు ఉండవని ఇసి స్పష్టం చేసినా, సామాన్యుల చెంతకరు వెళ్లాల్సిన బిఎల్‌వోలు వెళ్లకుంటే దానికి ఎవరు బాధ్యతులన్నది ప్రశ్న. జీవనోపాధికై గల్ఫ్ తదితర దేశాలకు వెళ్లిన తెలుగువారిలో అత్యధికులు గ్రామీణులే. వీరి విద్యార్హతలు అంతంత మాత్రమే. చిన్న చితకా పనులు చేస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా కొంత డబ్బును తమ కుటుంబాలకు పంపుతూ స్వదేశంలోని కుటుంబాలను పోషించుకుంటున్నారు. నే ఈ శ్రామిక జనులలో ఎక్కువ భాగం బడుగు, బలహీన వర్గాల వారే. పరాయి దేశంలో నివసిస్తున్నా, వారి మనసంతా సొంతూరు చుట్టే ఉంటుంది. సర్ కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఆ 'సవరణ' పక్రియ అసంఖ్యాక ప్రవాసులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపించడం ఖాయం. ఇప్పటి వరకు 'సర్' పూర్తయిన రాష్ట్రాలలో లక్షలాది వలస కార్మికులు, మహిళలు నష్టపోయారు. ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో 'సర్' ప్రభావం ఉంటుంది. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వారికి సరైన మార్గదర్శకత్వం చేసే నాయకత్వం కూడా కరువయింది. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఒక వ్యక్తి ఒక ప్రదేశంలో ఆరు నెలలకు మించి నివాసం ఉండని పక్షంలో అతను లేదా ఆమె పేరును తొలగించడం
ఖాయం. ప్రవాసులే కాదు, రాజకీయ నాయకులు సైతం ఓటరుగా తాము నమోదైన ప్రదేశాలలో నివసిస్తూ ఉండరనేది వేరే విషయం. ప్రవాసులు తమ పాస్‌పోర్టుల్లో చిరునామాగా పేర్కొన్న ప్రదేశంలో ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా ఇలా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే వారి సంఖ్య స్వల్పమే. ప్రవాస ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు గల్లంతవుతుందనే భయానికి తోడుగా పేర్లు, వయస్సులోని వ్యత్యాసాల కారణంగా ఈ రకమైన నమోదుకు అత్యధికులు ఇష్టపడడం లేదు. ప్రవాసులకు సంబంధించిన ఈ కీలక అంశాలపై సరైన సమాచారంతో సుదూర దేశంలో బతుకు దెరువు పొందుతున్న వారికి స్థానిక నాయకులు దిశా నిర్దేశర చేయవల్సిన అవసరం ఉంది. విదేశాలలో, ప్రత్యేకించి గల్ఫ్ దేశాలలో ఉపాధి పొందుతున్న తెలుగువారు లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ తెలుగు ప్రవాసుల ఉనికి విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాల్ లో పాలకులకుగానీ, రాజకీయ పక్షాలకుగానీ ఎలాంటి సూచనలు చేయడం లేదు. ఇలా ఇక్కడ లేని వారి పేర్లు తొలగిస్తే విదేశాల్లో బతుకుదెరువు కోసం పోయిన వారి ఓట్లు గల్లంతు అవుతాయి. తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ లాంటి జిల్లాలోని పలు గ్రామాల వారు అనేక మంది గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. వీరంతా జాగ్రత్త పడకపోతే ఓటు గల్లంతు ఖాయం.

# ఫార్చ్యూన్ జాబితాలో నారా బ్రహ్మణి

### మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026 అవార్డు అందచేత -అభినందనలు తెలిపిన చంద్రబాబు, నారా లోకేశ్

**అమరావతి, జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :**
హెరిటేజ్ ఫుడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రాహ్మణికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు దక్కింది. ప్రముఖ బిజినెస్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్ ఇండియా' ప్రకటించిన మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ - 2026 జాబితాలో ఆమె చోటు సంపాదించారు. భారతదేశ ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా పారిశ్రామికవేత్తల జాబితాలో బ్రాహ్మణి నిలవడం విశేషం. దిల్లీలో జరిగిన ఫార్చ్యూన్ ఇండియా 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్ 2026' సదస్సులో బ్రాహ్మణికి ఈ అవార్డును అందజేశారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానంలో రైతుల పాత్ర ఎనలేనిదని, పాల ఉత్పత్తిలో నూతన సాంకేతికతను జోడిస్తూనే.. అన్నదాతల జీవనోపాధిని మెరుగుపరచడమే తమ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా బ్రాహ్మణి స్పష్టం చేశారు. ఈ అరుదైన గుర్తింపును హెరిటేజ్ ఫుడ్స్ కుటుంబానికి, రైతులకు,




సంస్థ ఉద్యోగులకు అంకిత మిస్తున్నట్లు ప్రకటించారు. తన భార్య సాధించిన ఘనతపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఫార్చ్యూన్ ఇండియా ప్రకటించిన 100 మంది అత్యంత ప్రభావవంతమైన మహిళల జాబితాలో బ్రాహ్మణి నిలవడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఇలాగే ప్రతిభను చాటుతూ, నాయకత్వ లక్షణాలతో మరిన్ని అవరోధాలను అధిగమించాలని ఆకాంక్షించారు. 'ఫార్చ్యూన్ ఇండియా' విడుదల చేసిన 'మోస్ట్ పవర్‌ఫుల్ విమెన్' జాబితాలో నారా బ్రాహ్మణికి చోటు దక్కడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలిపారు. బ్రాహ్మణి ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో స్థానం సంపాదించడం ఎంతో అభినందనీయమని సీఎం పేర్కొన్నారు. ఇది ఆమె నాయకత్వం, దూరదృష్టి, అంకితభావానికి దక్కిన అరుదైన గుర్తింపని కొనియాడారు. బ్రాహ్మణి సాధించిన ఈ ఘనత యువతులకు, ముఖ్యంగా తెలుగు అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. భవిష్యత్‌లో కూడా బ్రాహ్మణి మరిన్ని విజయాలు సాధిస్తూ, కొత్త మైలురాళ్లను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తన సందేశంలో తెలిపారు.

# ఓటిటి సినిమాలకు కూడా సెన్సార్ షిప్

### తాజా పరిణామాలతో కేంద్రం యోచన

**న్యూఢిల్లీ, జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :**
భారతదేశంలో నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, డిస్నీ హాట్‌స్టార్ వంటి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో వచ్చే సినిమాలు, వెబ్ సిరీస్‌లపై కేంద్ర ప్రభుత్వం నిఘా పెంచాలని చూస్తుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న సమాచార సాంకేతిక రూల్స్, 2021 స్థానంలో సరికొత్త కఠిన నిబంధనలను తీసుకురావడానికి కసరత్తులు జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుత విధానం ప్రకారం, ఓటీటీ కంటెంట్‌ను థియేటర్లలో విడుదలయ్యే సినిమాల మాదిరిగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ముందస్తుగా పరిశీలించి ఎటువంటి సర్టిఫికేట్ ఇవ్వదు. ఇదంతా ఐటీ రూల్స్, 2021 పరిధిలోని డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్ ప్రకారమే నడుస్తోంది. దీనివల్ల ఆయా ప్లాట్‌ఫామ్‌లు తమ కంటెంట్‌ను వయస్సు ఆధారంగా విభజించి, కేవలం స్వీయ నియంత్రణ మాత్రమే పాటిస్తున్నాయి. అయితే, ఇటీవల కొన్ని ఓటీటీ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో మితిమీరిన బోల్డ్ సీన్లు, బూతులు మరియు వివాదాస్పద రాజకీయ, సామాజికాంశాలు ఎక్కువవుతున్నాయనే ఫిర్యాదులు ప్రభుత్వానికి పెద్ద ఎత్తున అందాయి. తాజా ఉదాహరణగా, పంజాబీ నటుడు దిల్జీత్ దోసాంజ్ నటించిన 'సత్లుజ్' సినిమా నిలిచింది. ఈ చిత్రం థియేట్రికల్ విడుదల కోసం సెన్సార్ బోర్డ్ వద్దకు వెళ్లినప్పుడు ఏకంగా 120కి పైగా కట్స్ చెప్పారు. అందుకు నిర్మాతలు నిరాకరించి, నేరుగా ఓటీటీ వేదికపై విడుదల చేసినప్పటికీ, వివాదం రేగడంతో కేవలం 48 గంటల్లోనే ఆ




సినిమాను తొలగించాల్సి వచ్చింది. ఇలాంటి ఘటనల నేపథ్యంలోనే, థియేటర్ల కోసం కాకుండా నేరుగా డిజిటల్ వేదికలపై వచ్చే కంటెంట్‌కు కూడా ముందస్తు పర్యవేక్షణ ఉండాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే ఓటీటీలో నేరుగా విడుదలయ్యే చిత్రాలకు కూడా సెన్సార్ సర్టిఫికేషన్ తప్పనిసరి చేయాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. కేవలం సినిమాలకే కాకుండా, ఓటీటీ వెబ్ సిరీస్‌లను కూడా ఈ సెన్సార్ పరిధిలోకి తీసుకురావాలా లేదా అనే అంశంపై వివిధ వర్గాలతో మరియు ఐటీ శాఖతో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రస్తుతం కీలక చర్చలు జరుపుతోంది. ఒకవేళ ఈ నిబంధనలు కనుక అమల్లోకి వస్తే, డిజిటల్ కంటెంట్ క్రియేటర్ల సృజనాత్మక స్వేచ్ఛపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

## ఆరుగురిని చంపి నరరూప రాక్షసుడు

### బాలికను బలవంతంగా కారులో తరలింపు

### సిసిటివీల్లో రికార్డు అయిన దృశ్యాలు

**రంగారెడ్డి, జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :**
పోక్సో కేసు పెట్టారనే కక్షతో రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. మైనర్ బాలికను నిందితుడు రాజ్‌కుమార్ బలవంతంగా ఇంటి నుంచి కారులో తీసుకెళ్తున్న దృశ్యాలు బయటకొచ్చాయి. దీనికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్‌కుమార్‌పై మే 16వ తేదీన పోక్సో కేసు నమోదైంది. మైనర్ బాలిక (17)ను వేధించాడని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మే 26వ తేదీన అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయితే శుక్రవారం అతను జైలుపై విడుదలయ్యాడు. ఈ క్రమంలో రాత్రి 11 గంటల సమయంలో మైనర్ బాలిక ఇంటికి వెళ్లాడు. షాబాద్ పీఆర్ఆర్ స్టేడియం సమీపంలోని మైనర్ బాలిక (17) ఇంట్లోకి ప్రవేశించి, ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మ అడ్డుపడ్డారు. దీంతో వారిద్దరినీ కత్తితో పొడి చంపాడు. అనంతరం బాలికను దైవాలగూడ సమీపంలోని చెరువు దగ్గరకు తీసుకెళ్లి పీకకోసి హత్య చేశాడు. శనివారం తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో తన ఇంటికి వెళ్లిన రాజ్‌కుమార్.. కట్టుకున్న భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్(4), దైవీక్షిత్(2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు. అనంతరం తండ్రి అరుణ్ కుమార్‌కు ఫోన్ చేసి అందర్నీ చంపేశానని.. తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని రాజ్ కుమార్ చెప్పాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అరుణ్ కుమార్ వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. కాగా, పోలీసుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఆరు హత్యలు జరిగాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.



## పానీపూరీ రుచి చూసిన అశ్వినీ వైష్ణవ్



**హైదరాబాద్, జులై 11 (రిపబ్లిక్ న్యూస్):** :హైదరాబాద్‌లో పర్యటిస్తున్న కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పానీ పూరి రుచి చూశారు. హెచ్ఐసీసీలో వికసిత్ భారత్-2047.. సాంకేతికత పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో కిషన్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఐసీసీలోని చాట్‌బండార్ వద్ద పానీ పూరి తిన్నారు. అనంతరం యూపీఐ ద్వారా రూ.175 అశ్వినీ వైష్ణవ్ చెల్లించారు.

# అల్లిపూర్ ప్రభుత్వ పాఠశాలలో
# ఘనంగా 'స్పిక్ మాకే' సాంస్కృతిక కార్యక్రమం





**రాయికల్ పట్టణం జూలై,11( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు భారతీయ సాంప్రదాయ కళలు, సంస్కృతిపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో స్పైసి మాచాయ్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని శుక్రవారం పాఠశాల ఆవరణలో అత్యంత ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కళాకారులు "తులిక రెడ్డి"జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు
ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, నేటి ఆధునిక కాలంలో మొబైల్ స్క్రీన్లు, పాశ్చాత్య సంస్కృతి వైపు మొగ్గు చూపుతున్న యువతరం, మన దేశపు అమూల్యమైన సాంప్రదాయ సంగీతం, శాస్త్రీయ నృత్యాలు మరియు హస్తకళల గొప్పదనాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారుస్పిక్ మాకే సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇటువంటి గొప్ప కళారూపాలను పరిచయం చేయడం అభినందనీయమని కొనియాడారు అనంతరం విద్యార్థులకు భారతీయ సంస్కృతి, కళల విశిష్టతను వివరిస్తూ చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.
పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోరండ్ల కిరణ్ మాట్లాడుతూ కేవలం చదువే కాకుండా విద్యార్థుల్లో సర్వతోముఖాభివృద్ధికి ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, మన పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించడం గర్వకారణమని తెలిపారు
ఈ కార్యక్రమంలో ఐఐఐటి బాసర విద్యార్థులు ఉధితప్రియా, నిఖిల రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, వసంత రావు,రవికుమార్, రతిలాల్ రాజశేఖర్,మహేష్, ఆనంద్, రజిత, బలమురళి, జీవన్ రెడ్డి, మల్లారెడ్డి మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బీఎస్పీ మెదక్ పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశం













**మెదక్ జిల్లా ప్రతినిధి జులై 11( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
మెదక్ పార్లమెంట్ స్థాయి సమీక్ష సమావేశం తేదీ 11/7/2026 రోజున మెదక్ పట్టణంలోని ఎన్జీవో భవన్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడపట్ల ఈశ్వర్ గారు హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బహుజన్ సమాజ్ పార్టీని గ్రామ గ్రామాన విస్తరించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. బూత్ కమిటీల నిర్మాణం గురించి వివరిస్తూ సెక్టార్ కమిటీలను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం కోసం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలందరూ కలిసి పార్టీ గ్రామస్థాయిలో బలుపితం చేయడం కోసం అందరు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మెదక్ పట్టణంలో బీఎస్పీ పార్టీ జిల్లా కార్యాలయం ఓపెన్ చేయడం జరిగింది. మరియు గతంలో పార్టీలో పనిచేసే చనిపోయిన సీనియర్ నాయకులు శాంత కుమార్ అన్న గారికి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ నాయక్ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి మెదక్ పార్లమెంటు ఇంచార్జిలు పంగబాబు డప్పు ప్రేమ్ కుమార్ పుప్పడ్ పల్లి మోహన్ జిల్లా అధ్యక్షులు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పుల్లూరు ఉమేష్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గొల్ల సతీష్ మెదక్ జిల్లా అధ్యక్షులు ఎర్ర శంకర్ సిద్దిపేట జిల్లా నాయకులు సంగారెడ్డి జిల్లా నాయకులు మెదక్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## కొల్చారం బీసీ హాస్టల్ వార్డెన్ పేరుకు మాత్రమే
## పెత్తనం కొనసాగిస్తున్న కొల్చారం గ్రామ సర్పంచ్







**మెదక్ జిల్లా ప్రతినిధి**
**జూలై 11 (ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
మెదక్ జిల్లా కొల్చారం మండలం బీసీ హాస్టల్ వార్డెన్ పత్రిక విలేకరులమైన మేము హాస్టల్ సమస్యల గురించి వెళ్ళినప్పుడు అక్కడ ఉన్న సిబ్బంది భోజనాలు చేస్తున్న సందర్భంలో సిబ్బందికి మేడం వచ్చారా లేదా అని అడగగా వాళ్లు ఎలాంటి సమాచారం ఇయ్యలేదు దానితో అసలు ఈ హాస్టల్కు వార్డెన్ ఉన్నారా లేదా అనే గుసగుసలు వినబడుతున్నాయి అదే సందర్భంగా అక్కడున్న సిబ్బందికి అడిగి మేడం నెంబర్ ఇవ్వమని అడగడంతో నెంబర్ తీసుకొని మేడం తో మాట్లాడే సందర్భంలో నాకు ఎలాంటి సంబంధం లేదు ఏదైనా విషయం కావాలంటే గ్రామ సర్పంచిని సంప్రదించాలని ఆమె అనడం జరిగింది అంటే ఈ హాస్టల్కు వార్డెన్ గా విధులు నిర్వహిస్తున్న ఉమా మేడమా లేక గ్రామ సర్పంచ అనే అనుమాన సందర్భాలు వెలువెత్తుతున్నాయి అదే విధంగా వసతి ప్రాంతంలో ఉన్న బాత్రూం సరియైన నీటి సదుపాయం లేక బాత్రూం కి వెళ్లాలంటే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు ఇది వార్డెన్ కు సర్పంచికి కంటికి కనబడడం లేదా సర్పంచిగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలలో బాత్రూం సౌకర్యం కల్పించవలసిన ఒక ప్రథమ పౌరుడిగా ఉండి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బాత్రూం సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అతనిపై ఉన్నప్పటికీ అక్కడ బాత్రూములు నిర్మించలేక ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులను ఇదే వసతి గృహంలోకి పంపించడం ఎంతవరకు నిజం అని తీవ్రంగా ఖండిస్తున్నారు వెంటనే బిసి వెల్ఫేర్ జిల్లా నాయకులు వెంటనే స్పందించి బిసి హాస్టల్ వార్డెన్ ఉమా మేడం పై తక్షణమే చర్యలు తీసుకొని ఆమెకు సహకరిస్తున్న సర్పంచ్ పై చర్యలు తీసుకొని విద్యార్థులకు స్థానికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాం

## మంత్రి దామోదర్ రాజనర్సింహ కు శాలువా తో సన్మానించిన కో ఆప్షన్ మెంబర్ జిశాన్, టీ వై జె ఎఫ్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ అభేద్.



**ఆందోల్ నియోజకవర్గం**
**ప్రతినిధి జులై 11 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్)**
ఆందోల్ మండలం జోగిపేట మంత్రి దామోదర్ రాజనర్సింహ అందోల్ జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో బిఎల్ఎ తో సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహ గారికి కో ఆప్షన్ మెంబర్ మహమ్మద్ జిశాన్, టీ వై జె ఎఫ్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అభేద్ పూల బొకే , శాలువాతో సన్మానించారు.

# మహాపురుషులు సాగించిన ఉద్యమాలు బహుజనుల్లో చైతన్యాన్ని రగిలిస్తాయి
## బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం







**జగిత్యాల ప్రతినిధి జులై 11 ( ప్రజా రిపబ్లిక్ న్యూస్ )**
మహాపురుషులు సాగించిన ఉద్యమాలు బహుజనుల్లో చైతన్యాన్ని రగిలిస్తాయి అని బహుజన్ సమాజ్ పార్టీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం అన్నారు. ఈ రోజు జగిత్యాల జిల్లా కమిటీ రివ్యూ సమావేశం కి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాతంగి అశోక్ , జోన్ ఇంచార్జ్ కల్లెపెల్లి రాజేందర్ లతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహానీయుల చిత్రపటాలకు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించి అనంతరం జిల్లా కమిటీని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల కమిటీల ని రివ్యూ చేశారు. పార్టీ నిర్మాణాలు అత్యంత కీలకమని అందుకు మీరందరు అన్ని స్థాయిల్లో కమిటీ లను పూర్తి చేయాలని ఆదేశించారు. మహనీయులు సాగించిన ఉద్యమాలు నేటి బహుజన్ సమాజం లో చైతన్యాన్ని రగిలిస్తాయి అని అన్నారు. ఈ సామాజిక రాజకీయ చైతన్యం వలన అమ్ముడు పోని సమాజం ఏర్పడుతుందని , అమ్ముడు పోని సమాజం నుండి అమ్ముడు పోని నాయకులు వస్తారని , అమ్ముడుపోని నాయకులు మాత్రమే మహానీయుల ఆశయాలను నెరవేరుస్తారని అన్నారు. మన సమాజం వేళ సంవత్సరాల నుండి అక్షరం కి అధికారం కి ఆయుధం కి ఆత్మగౌరవం కి అంతస్థు కి దూరం గా ఉంచబడ్డారు. ఈ వెనకబాటు తనానికి కారణమైన అసమానతలతో కూడిన నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ వలన బహుజనులు అన్ని రంగాల్లో వెనుకబడ్డారు అని అన్నారు. ఈ అసమానతలతో కూడిన వ్యవస్థ ను మార్చుట కోసం మహాత్మా ఫూలే, సాహూజీ మహారాజ్ , పెరియార్ , బాబాసాహెబ్ అంబేడ్కర్ లు వారి జీవిత కాలం లో అనేక సామాజిక ఉద్యమాలు చేశారు. వారి ఉద్యమాలు బహుజన కులాల్లో చైతన్యాన్ని రగిలిస్తాయి అని అన్నారు. ఈ దేశంలో వేల సంవత్సరాలుగా రాజ్యాధికారం లేక దూరమైన బహుజన సమాజానికి రాజ్యాధికారం అందించేందుకు మాన్యవర్ కాన్షీరామ్ గారు మహానీయుల త్యాగాలను చరిత్ర ను ప్రజలకు చెప్పి రాజకీయ చైతన్యం రగిలించి ఉత్తర ప్రదేశ్ లో బహుజన రాజ్యాధికారం సాధించారు అని అన్నారు. తెలంగాణ లో కూడ ప్రజలకు బహుజన పితామహుల త్యాగాలు పోరాటాల ను వివరిస్తే ఇక్కడ బహుజన సమాజానికి రాజకీయ చైతన్యం కలిగి తెలంగాణ లో బహుజన రాజ్యం సాధిస్తామని అన్నారు. ఈ ఉద్యమం ను గ్రామ గ్రామాన తీసుకెళ్లడానికి పార్టీ నిర్మాణం జిల్లా కమిటీలు అసెంబ్లీ కమిటీలు సెక్టార్ కమిటీ లు మరియూ బూత్ కమిటీలు అత్యంత కీలకమని అన్నారు. అందుకే మీరందరు గ్రామాల్లోకి వెళ్లి పోలింగ్ బూత్ కమిటీ లను నిర్మించాలని అన్నారు.
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాతంగి అశోక్ మాట్లాడుతూ బిజెపి మళ్లి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగం ను రద్దు చేస్తారని అన్నారు. కాంగ్రెస్ బిఆర్ ఎస్ బిజెపి అన్ని ఒకే ఎజెండా కలిగిన పార్టీలు అని కేవలం బీఎస్పీ ద్వారా మాత్రమే బహుజనులకు న్యాయం జరుగుతుందని అన్నారు. చట్టాలు అన్ని అగ్ర కులాలకే వర్తిస్తాయని బహుజన సమాజం పై మహిళలపై మానభంగాలు జరిగితే పాలకులు మనకు న్యాయం చేయడం లేదన్నారు. సామాజిక అసమానతలు రూపు మాపి సామ్రాట్ అశోకుడి కాలం నాటి సమతా సమాజం ను పునర్నిర్మాణం చేసేందుకు బహుజన రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జోన్ ఇంచార్జ్ కల్లెపెల్లి రాజేందర్ , జిల్లా అధ్యక్షుడు బెల్లంపల్లి సంపత్ కుమార్ , ఉపాధ్యక్షుడు అడ్వకేట్ బిరుదుల లక్ష్మన్, ప్రధాన కార్యదర్శి రాపర్తి వేణుగోపాల్ , జిల్లా కార్యవర్గ సభ్యులు బోనగిరి లక్ష్మన్ ధర్మపురి అసెంబ్లీ ఇంచార్జ్ నక్క గంగాధర్, కల్లెపెల్లి తిరుపతి , కోరుట్ల అసెంబ్లీ అధ్యక్షులు వనతడుపుల మహాతేజ్ , ధర్మపురి అసెంబ్లీ అధ్యక్షులు కొత్తూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీల సంక్షేమ ఆధ్యుడు ఎన్ టీ ఆర్

**ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుంటే ఉజ్వల భవిష్యత్తు**

**ఉద్యోగ, ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి**

**మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**మెగా జాబ్ మేళాకు విశేష స్పందన**

**ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన మంత్రి ఫరూక్**



**విజయవాడ , జులై 11( రిపబ్లిక్ న్యూస్) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మైనారిటీ వర్గాల సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేకంగా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి వారి సంక్షేమానికి ఆధ్యుడిగా దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నిలిచారని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. శనివారం విజయవాడ నగరంలోని ఇస్లాంపేటలో ఉన్న షాజహూర్ మూసాఫిర్ ఖానా లో మైనారిటీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కల్పనకు మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు దాదాపు 70 అంతర్జాతీయ, జాతీయ ప్రఖ్యాతిగాంచిన కంపెనీలు పాల్గొని, ప్రతిభ కలిగినవారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి నియామక పత్రాలు అందజేశారు. ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళాను మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మైనారిటీ నిరుద్యోగ యువతను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి నేటి వరకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. పేదరికం, నిరక్షరాస్యత, తదితర కారణాల చేత మైనారిటీలు ఎంతో వెనుకబడి, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని దివంగత సీఎం ఎన్ టీ ఆర్ దూర దృష్టితో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ను 1985లో ఏర్పాటు చేసిన విషయాన్ని మంత్రి విశదీకరించారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా శిక్షణ, స్వయం ఉపాధి, ఉద్యోగాల కల్పన, సరళీకృతమైన రీతిలో రుణాలు మంజూరు, తదితర ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదని అన్నారు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని , సద్వినియోగం చేసుకున్నప్పుడే మైనారిటీలు ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా బడ్జెట్ ను కేటాయించడం జరిగిందన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం విదేశాల్లో సైతం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన రీతిలో సంక్షేమానికి కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. భారతీయ భాషలే కాకుండా ఇతర దేశాల భాషలు జర్మన్, చైనీస్, తదితర భాషల్లో ప్రావీణ్యం సంపాదిస్తే విదేశీ ఉద్యోగ అవకాశాలు అందుపుచ్చుకోవచ్చని మంత్రి ఫరూక్ యువతను కోరారు. మైనారిటీ నిరుద్యోగ యువత కోసం ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహణకు చొరవ తీసుకున్న మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ మౌలానా, ఎండి యాకుబ్ భాష లను మంత్రి అభినందించారు. జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి మంత్రి ఫరూక్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ ముక్తియార్, రిటైర్డ్ ఐపిఎస్, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్, ఇతర డైరెక్టర్లు, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ఎవరి ఓటు హక్కు తొలగించబడదు

**ఎన్యుమరేషన్ ఫారాలు వెంటనే సమర్పించాలి: కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

**జిల్లాలో 82.27 శాతం డిజిటలైజేషన్ పూర్తి జూలై 21న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల**

**శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలు**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జూలై 11)** జిల్లాలోని ఏ ఒక్క ఓటరు కూడా భయపడాల్సిన అవసరం లేదని, ఎవరి ఓటు హక్కు తొలగించబడదని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి స్పష్టం చేశారు. ఓటర్లు తమకు అందిన ఎన్యుమరేషన్ ఫారాలను వెంటనే సంబంధిత బీఎల్ఓలకు సమర్పించాలని ఆమె కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియ పురోగతిని కలెక్టర్ వివరించారు. జిల్లాలో మొత్తం 20.86 లక్షల మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 17,16,351 మంది వివరాల డిజిటలైజేషన్ పూర్తైందని, ఇది 82.27 శాతానికి సమానమని తెలిపారు. ఇంకా 3,69,768 మంది ఓటర్ల వివరాలు డిజిటలైజ్ చేయాల్సి ఉందన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలను 99.5 శాతం మంది ఓటర్లకు పంపిణీ చేసినట్లు వెల్లడించిన కలెక్టర్, 2002 తర్వాత ఓటర్లుగా నమోదైనవారు, కొత్తగా ఓటర్లైనవారు సహా అందరి వివరాలను మ్యాపింగ్ చేసినట్లు తెలిపారు. ఫారాలు అందని వారు లేదా ఇప్పటివరకు సమర్పించని వారు శని, ఆదివారాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్ల సందేహాల నివృత్తి కోసం 'బుక్ ఏ కాల్' సదుపాయం అందుబాటులో ఉందని, రాష్ట్రంలోనే అత్యధికంగా కర్నూలు జిల్లాలో 8 వేలకుపైగా కాల్స్‌కు స్పందించి సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. ఫోన్ ద్వారా వచ్చిన సందేహాలను 48 గంటల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

జూలై 21న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ ముద్రిస్తామని, అయితే అది తుది జాబితా కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి అందని ఓటర్లను 'అబ్సెంట్' లేదా 'షిఫ్టెడ్' కేటగిరీలలో తాత్కాలికంగా నమోదు చేయవచ్చని, అయినప్పటికీ వారి ఓటు హక్కు వెంటనే రద్దు కాదని వివరించారు. డ్రాఫ్ట్ జాబితాలో పేరు లేకపోయినా సంబంధిత ఓటరుకు నోటీసులు జారీ చేసి, అవసరమైన అవకాశాలు కల్పించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని చెప్పారు. అందువల్ల ఎలాంటి అపోహలకు లోనుకాకుండా మంగళవారం వరకు జరుగనున్న డిజిటలైజేషన్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, ఎన్యుమరేషన్ ఫారాలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పిలుపునిచ్చారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



**జూలై 11: నంద్యాల క్రైమ్(రిపబ్లిక్ న్యూస్) :** నకిలీ ఏపీకే (APK) ఫైళ్లు, నిషేధిత లోన్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడుల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ సూచించారు.

వాట్సాప్, టెలిగ్రామ్, ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ యాప్ స్టోర్ మినహా ఇతర వనరుల నుంచి యాప్‌లు డౌన్‌లోడ్ చేయరాదన్నారు. తక్కువ వడ్డీతో రుణాల పేరుతో వచ్చే నకిలీ యాప్‌లను నమ్మవద్దని, సీబీఐ, ఈడీ, పోలీసులమంటూ వీడియో కాల్స్ చేసి డబ్బులు డిమాండ్ చేసే "డిజిటల్ అరెస్ట్" పూర్తిగా మోసమేనని స్పష్టం చేశారు.

బ్యాంకు అధికారులు, పోలీసులు ఎప్పుడూ ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్‌లు అడగరని, తెలియని వ్యక్తుల వీడియో కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే తొలి 24 గంటల్లోనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా **www.cybercrime.gov.in**-లలో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ తెలిపారు

# నంద్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విజయ్ కుమార్ బాధ్యతల స్వీకారం.



**జూలై 11: నంద్యాల క్రైమ్(రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సూపరింటెండెంట్ గా ఎస్. విజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. వీరు 2005వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 నోటిఫికేషన్ ద్వారా సబ్-ఇన్స్పెక్టర్ గా ఎంపికయ్యారు. తన సుదీర్ఘ సర్వీసులో భాగంగా వీరు వైఎస్ఆర్ కడప జిల్లాలోని ముద్దనూరు, ప్రొద్దుటూరు స్టేషన్లలోనూ, చిత్తూరు మరియు అనంతపురం జిల్లా తాడిపత్రి స్టేషన్లలో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ గా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. గతంలో, 2024 ఎన్నికల విధి నిర్వహణలో భాగంగా నంద్యాలలో సి.ఐ.గా కూడా సేవలు అందించారు. ఇటీవల జరిగిన పదోన్నతులలో భాగంగా వీరు అసిస్టెంట్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొంది, ప్రస్తుతం నంద్యాల జిల్లాలో బాధ్యతలు చేపట్టారు.

# ఘనంగా ఎస్ఎస్ జీ వార్షిక క్రీడల పోటీలు

**ముఖ్య అతిథిగా హాజరైన ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్రలడ్డా**



**అమరావతి, జులై 11 (రిపబ్లిక్ న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ విభాగంలోని స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ వార్షిక క్రీడల పోటీలు ఘనంగా జరిగాయి. మంగళగిరిలోని ఎస్ఎస్ జీ గ్రౌండ్స్ లో నిర్వహించిన ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మహేష్ చంద్ర లడ్డా, ఐజీ పీహెచ్ డీ రామకృష్ణ తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ డైరెక్టర్ ఏ.జగదీష్, ఎస్పీ చెన్నుపాటి భద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షిక పోటీల్లో 25 క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డా టగ్ ఆఫ్ వార్ పోటీలను ప్రారంభించారు. క్రీడల పోటీల్లో ఆరు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిన ఎస్. కమలేంద్రరావు ఈ ఏడాది వార్షిక క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచారు. క్రీడలు శారీరక ధృడత్వాన్ని మానసిక ఉల్లాసాన్ని, టీమ్ స్పిరిట్ ను పెంపొందిస్తాయని ఇంటెలిజెన్స్ చీఫ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో అందరికీ అల్పాహార విందు ఏర్పాటు చేశారు. వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్రీడాపోటీలను నిర్వహించేందుకు సహకరించిన ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయం అధికారులు, శాప్ చైర్మన్ రవినాయుడు, ఇతర అధికారులకు స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ధన్యవాదాలు తెలియచేసింది.

# నంద్యాల జిల్లా సీనియర్ చదరంగం జట్ల ఎంపిక పోటీలు

**ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణ రెడ్డి, డాక్టర్ రవి కృష్ణ -.చదరంగం మేధో శక్తిని,ఏకాగ్రతను పెంచుతుంది: డాక్టర్ రామకృష్ణారెడ్డి**

**. ఈనెల 18,19వ తేదీలలో నంద్యాలలో రాష్ట్రస్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్షిప్ పోటీలు నిర్వహిస్తున్నాం: జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ**



**నంద్యాల జూలై 11 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో శనివారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా సీనియర్ చదరంగం జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు.

నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం మేధో శక్తిని,ఏకాగ్రతను ఇనుమడింప చేస్తుందని అన్నారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ చదరంగం క్రీడ వలన బాలలలో మానసిక వికాసం కలుగుతుందని,

క్రీడలు విద్యార్థులలో గెలుపు ఓటములను స్వీకరించే మనస్తత్వం, ఓటమి చెందాక తిరిగి గెలవాలనే పట్టుదల పెంచుతాయని అన్నారు. నిరంతర సాధన ద్వారా చదరంగంలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని కోరారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారు నంద్యాల లో ఈనెల 18,19వ తేదీలలోజరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

డాక్టర్ రామకృష్ణారెడ్డి,డాక్టర్ రవి కృష్ణ చెస్ బోర్డుపై పావులు కదిపి చదరంగం పోటీలను లాంచనంగా ప్రారంభించారు. 200 మంది పైగా చదరంగం క్రీడాకారులు జిల్లా నలుమూలల నుండి వచ్చి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్, మేడా చంద్రశేఖర్, జోనల్ చైర్మన్ సోమేశుల నాగరాజు,చెస్ సంఘం సంయుక్త కార్యదర్శులు ఇమామ్, రాజా రమేష్ చక్రవర్తి, కోచ్ లు అరుణ్, మాలిక్ భాషా, సురేష్, అధిక సంఖ్యలో క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జూలై 14లోగా ఎన్యూమరేషన్ ఫారమ్‌లు సమర్పించాలి

**ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకొని ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలి**

**అర్హులందరి పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి**

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**



**నంద్యాల బ్యూరో, జూలై 11( రిపబ్లిక్ న్యూస్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు ప్రతి అర్హత కలిగిన ఓటరు తన ఎన్యూమరేషన్ ఫారమ్‌ను తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. జూలై 14తో ఈ ప్రత్యేక కార్యక్రమం ముగియనున్నందున మిగిలిన రోజులను సద్వినియోగం చేసుకొని ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆమె కోరారు. శనివారం వీడియో సందేశం ద్వారా జిల్లా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, నంద్యాల జిల్లాలో ప్రస్తుతం 14,05,443 మంది ఓటర్లు నమోదై ఉన్నారని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం, విశ్వసనీయతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి రెండు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను అందజేస్తున్నారని తెలిపారు. ఒక ఫారమ్‌ను ఓటరు స్వీకరించినట్లు అక్నాలెడ్జ్ చేయగా, రెండవ ఫారమ్‌ను అవసరమైన వివరాలతో పూరించి తిరిగి బూత్ లెవెల్ అధికారులకు అందజేయాల్సి ఉంటుందని వివరించారు. అందిన ఫారమ్‌లన్నింటినీ డిజిటలైజ్ చేసి తుది ఓటరు జాబితా తయారీకి వినియోగిస్తామని తెలిపారు. ఫారమ్‌ను తిరిగి సమర్పించని పక్షంలో సంబంధిత ఓటరు పేరు రాబోయే డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌లో నమోదు కాకపోయే అవకాశం ఉందని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 10,90,722 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి తిరిగి అందగా వాటిని విజయవంతంగా డిజిటలైజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే బూత్ లెవెల్ ఏజెంట్ల సహకారంతో మరణించిన వారు, డూప్లికేట్ నమోదులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి, అలాంటి 55,449 ఫారమ్‌లను కూడా డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంకా 2,59,272 ఎన్యూమరేషన్ ఫారమ్‌లు ఓటర్ల నుంచి అందాల్సి ఉందన్నారు. మిగిలిన ఫారమ్‌ల సేకరణను వేగవంతం చేసేందుకు శనివారం, ఆదివారం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జూలై 14 గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఓటరు బాధ్యతగా స్పందించి తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌ను వెంటనే సంబంధిత బూత్ లెవెల్ అధికారికి అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విజ్ఞప్తి చేశారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, బూత్ లెవెల్ ఏజెంట్లు, అధికారులు సమిష్టిగా సహకరించాలని కోరారు. పారదర్శకమైన, సమగ్రతతో కూడిన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి ఓటరి భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు విలువైనదని కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com